సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 13.11.2026


www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 006
పేజీలు: 08 వెల: రూ. 5

రూ.50 కోట్ల బంగారం చోరీ

- మధురైలో తనిష్క్ షోరూమ్‌లో ఘటన
- గోడకు కన్నం వేసి 20 కిలోల బంగారం ఎత్తుకెళ్లిన దొంగ!
- కొత్త షోరూమ్‌నే టార్గెట్ చేసిన దుండగుడు.. పోలీసులకు సవాల్!
- కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు చోరీ!
- సీసీటీవీలో చిక్కిన అనుమానితుడు..
- రూ.50 కోట్ల చోరీపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం

2



రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్

తెలంగాణలో లక్ష మంది వలంటీర్ల నియామకంపై సర్కార్ కసరత్తు!

ప్రతి 50 నుంచి 100 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించే యోచన!



ముద్ర, తెలంగాణ బ్యూరో/ హైదరాబాద్:

తెలంగాణలో సంక్షేమ పథకాల అమలును మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకే చేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరికొత్త వ్యూహానికి తెరతీస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మందితో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కసరత్తు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రతి 50 నుంచి 100 కుటుంబాలకు ఒక ప్రతినిధిని నియమించి, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించేలా ఈ వ్యవస్థను రూపొందించాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.

'ప్రజాబలం' పేరుతో త్వరలో గ్రామాల్లో పర్యటించాలని భావిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఆరు గ్యారెంటీలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదన ప్రభుత్వానికి పరిపాలనాపరంగా ఎంతవరకు ఉపయోగపడుతుందో, రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో అన్న చర్చ కూడా మొదలైంది. మిగతా 02లో

- 'ప్రజాబలం' పేరుతో గ్రామాల్లోకి సీఎం!
- సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చడమే లక్ష్యంగా వ్యూహం!
- నిరుద్యోగులకు గౌరవ వేతనంతో ఉపాధి
- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవస్థ!
- ఏపీ వలంటీర్ల అనుభవాలతో తెలంగాణ సర్కార్‌కు కొత్త సవాళ్లు!
- ప్రతిపక్షాల విమర్శలకు అవకాశం!
- డేటా భద్రత, రాజకీయ జోక్యంపై సర్కార్‌కు కీలక పరీక్ష!
- సంక్షేమానికి బలమా.. రాజకీయంగా రిస్కా?

సజ్జనార్‌ను పక్కనపెట్టారా?

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన.. తెలంగాణలో ఐపీఎస్‌ల బదిలీలు

- సజ్జనార్‌కు షాక్.. హైదరాబాద్ సీపీ బాధ్యతల నుంచి బదిలీ
- హైదరాబాద్ సీపీగా మహేష్ భగవత్..
- ఫైర్ సర్వీసెస్ డీజీగా సజ్జనార్ బదిలీ
- తెలంగాణలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీ..
- కీలక శాఖల్లో భారీ మార్పులు
- ఏసీబీ డీజీగా చారు సిన్హా.. జైళ్ల శాఖకు స్వాతి లక్రా!
- కీలక పోస్టుల్లో కొత్త అధికారులు!

ముద్ర, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భారీ ప్రక్షాళన జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పర్యవేక్షణలో వేగం పెంచే దిశగా ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ చేసిన ఈ ఉత్తర్వుల్లో అత్యంత కీలకమైన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ మార్పుతో పాటు, అవినీతి నిరోధక శాఖ, శాంతిభద్రతలు, ఆర్టీసీ, సివిల్ సప్లైస్ వంటి ప్రధాన విభాగాలకు కొత్త అధిపతులను నియమించారు.

హైదరాబాద్ సీపీ సజ్జనార్ బదిలీ

ఈ బదిలీల ప్రక్రియలో అత్యంత చర్చనీయాంశంగా మారిన అంశం సీనియర్ ఐపీఎస్ అధికారి వి.సి. సజ్జనార్ బదిలీ. ఇప్పటివరకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా వ్యవహరించిన సజ్జనార్‌ను ఆ కీలక బాధ్యతల నుంచి తప్పించి, తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ గా బదిలీ చేశారు. మిగతా 02లో

భారత్ సమ్మిట్

హైదరాబాద్ లో ఘనంగా నిర్వహణ

- 70 దేశాల ప్రతినిధుల రాక
- రాహుల్ గాంధీ పర్యటనపై ఉత్కంఠ
- నవంబర్ 13, 14 తేదీల్లో సదస్సు
- అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్ సర్కార్

ముద్ర, హైదరాబాద్:

తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ స్థాయి సదస్సుకు వేదిక కానుంది. నవంబర్ 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రెండో విడత భారత్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 దేశాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులు, విధాన నిర్ణేతలు హాజరుకానున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, అంతర్జాతీయ అభివృద్ధి, సమకాలీన రాజకీయ పరిణామాలు వంటి కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయి. అయితే ఈ సమ్మిట్‌కు సంబంధించి ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధానంగా చర్చ జరుగుతున్న అంశం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పర్యటన. ఆయన భారత్ సమ్మిట్‌కు హాజరవుతారా? హైదరాబాద్‌కు వస్తే ఎలాంటి అంశాలపై ప్రసంగిస్తారు? రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమవుతారా? అన్న ప్రశ్నలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాహుల్ గాంధీ పర్యటనకు సంబంధించి అధికారిక షెడ్యూల్‌పై స్పష్టత రావాల్సి ఉంది.

అంతర్జాతీయ వేదికపై కాంగ్రెస్ సిద్ధాంతాలు

భారత్ సమ్మిట్‌ను కాంగ్రెస్ పార్టీ అంతర్జాతీయ స్థాయిలో తన సిద్ధాంతాలు, ప్రగతిశీల ఆలోచనలు, ప్రజాస్వామ్య విలువలను చాటిచెప్పేందుకు ఉపయోగించుకునే అవకాశం ఉందనే అభిప్రాయాలు మిగతా 02లో



కొత్త పింఛన్లు

కొత్తగా 4.5 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు

- నవంబర్ 19న లబ్ధిదారుల ఖాతాల్లోకి పింఛన్
- 12 నుంచి 18 వరకు మంజూరు పత్రాల పంపిణీ
- మహిళలకు పెద్దపీట.. కొత్త పింఛన్లతో కుటుంబాల్లో ఆనందం
- కొత్త పింఛన్ల లబ్ధిదారులు 5.73 లక్షలు

2



ఇప్పుడంతా ఇన్ స్టా రీల్స్

ప్రెస్ రిలీజ్‌లు పోయాయి

2

- మీడియా సేవలను కొనియాడిన ప్రధాని మోదీ
- జర్నలిజంలో సాంకేతిక విప్లవం
- 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం
- విజయగాథలను ప్రపంచానికి చాటండి




16న జాతీయ పత్రికా దినోత్సవం

ఘనంగా నిర్వహించాలని ఐజేయూ పిలుపు

- మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రతపై చర్చలు
- పీసీఐ భద్రతా మార్గదర్శకాలపై ఐజేయూ అసంతృప్తి
- జర్నలిస్టుల హక్కులను కాపాడాలని డిమాండ్

3



కోర్టుకు సీఎం రేవంత్ రెడ్డి

కరోనా నిబంధనల ఉల్లంఘన కేసులో హాజరు

- 2021లో ఉప ఎన్నిక ప్రచార సమయంలో నమోదైన కేసు
- నాగార్జునసాగర్ ఉప ఎన్నికల ప్రచారమే కారణం
- సీఆర్‌పీసీ 313 కింద రేవంత్ వాంగ్మూలం నమోదు



2

కీసర లంచం కేసులో ట్విస్ట్

- రూ.2 లక్షల లంచంతో బయటపడిన రూ.20 లక్షల బాగోతం!
- ఒకరి తర్వాత మరొకరు.. పోలీసుల లంచాల గుట్టు రట్టు!
- పాత లంచం వ్యవహారంతో కొత్త కేసులో బిగ్ ట్విస్ట్!
- నా వాటా ఇవ్వాల్సిందే.. బాధితుడిని బెదిరించిన ఎస్ఐ!



3

నమ్మకమైన భాగస్వామితో విజయాలు

పెట్టుబడిదారులకు ఏపీ సీఎం భరోసా


- ఏపీకి రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు..
- 714 ఒప్పందాలు
- బ్లూ గ్రీన్ సిటీగా అమరావతి..
- తిరుపతిని గ్లోబల్ చిప్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతాం



2

ఇదీ AI ముద్ర

వివాహేతర సంబంధాలు కొంపముంచాయి..
ఎన్వీడియా సీఈవో రాజీనామా..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 13 నవంబర్, 2026

టీ, కాఫీతో సిగరెట్‌కు బ్రేక్ వేయండి!

టీ, కాఫీ తాగేటప్పుడు సిగరెట్ కాల్చడం చాలామందికి అలవాటు. ఈ కాంబినేషన్‌ను మార్చుకోవాలి. సిగరెట్ గుర్తుకొచ్చే సందర్భాల్లో కొత్త అలవాట్లను ఏర్పరుచుకోవాలి.





రేవంత్ మాస్టర్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

ఏపీలో గతంలో అమలైన వలంటీర్ల వ్యవస్థను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాల అమలులో మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి, ప్రజలకు నేరుగా సేవలు అందించగలిగితే ఈ వ్యవస్థ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చే అవకాశం ఉంది. మరోవైపు రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థను వినియోగిస్తున్నారన్న విమర్శలు వస్తే మాత్రం అదే ప్రభుత్వానికి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది.

ముఖ్యంగా నిరుద్యోగ యువతకు గౌరవ వేతనంతో ఉపాధి కల్పన, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సమాచార వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలు ఈ ప్రతిపాదనకు సానుకూలంగా కనిపిస్తున్నాయి. కానీ శాశ్వత ఉద్యోగాల భర్తీకి బదులుగా గౌరవ వేతన నియామకాలు చేపడుతున్నారంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించే అవకాశం ఉంది. వ్యక్తిగత సమాచార భద్రత, నియామకాల్లో పారదర్శకత, రాజకీయ జోక్యం వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి.

లక్ష మంది వలంటీర్ల వ్యవస్థ ప్రతిపాదన అమలులోకి వస్తే తెలంగాణ పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే ఈ వ్యవస్థను పూర్తిగా రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా నిర్వహించగలిగితేనే ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరుతుంది. లేకపోతే సంక్షేమానికి ఉద్దేశించిన ఈ ప్రయోగం రాజకీయంగా రివర్స్ అయ్యే ప్రమాదం ఉంది.

సజ్జనార్‌ను పక్కనపెట్టారా?

(మొదటి పేజీ తరువాయి)

దీనితో పాటు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు డీజీ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పూర్తి అదనపు బాధ్యతలను కూడా ఆయనకు అప్పగించారు. హైదరాబాద్ సీపీ వంటి అత్యంత ప్రభావవంతమైన పోస్టు నుంచి సజ్జనార్‌ను అగ్నిమాపక, విపత్తు నిర్వహణ విభాగానికి మార్చడం పోలీసు, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

మహేష్ భగవత్‌కు సీపీ పోస్టింగ్

సజ్జనార్ స్థానంలో నూతన హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 1995 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు రాష్ట్ర శాంతిభద్రతల విభాగం డీజీపీగా పనిచేసిన మహేష్ భగవత్‌కు రాజధాని శాంతిభద్రతల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. గతంలో రాచకొండ కమిషనర్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవం ఉన్న భగవత్ నియామకం, రాజధాని పోలీసింగ్‌లో కీలక మార్పులకు సంకేతంగా భావిస్తున్నారు. మరోవైపు, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న 2001 బ్యాచ్ అధికారి అకున్ సబర్వాల్ ను అదనపు డీజీపీగా నియమించడంతో పాటు, కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల అదనపు బాధ్యతలను అప్పగించారు.

ఏసీబీ డైరక్టర్ జనరల్‌గా చారు సిన్హా

సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిణి చారు సిన్హా పూర్తిస్థాయి ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ అయ్యారు. అంతేకాకుండా ఆమెకు సీఐడీ డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు కొనసాగించారు. జైళ్ల శాఖ డీజీగా ఉన్న డాక్టర్ సౌమ్య మిశ్రా ను మహిళా భద్రత, షీ టీమ్స్ , భరోసా విభాగం డీజీపీగా నియమించగా, స్వాతి లక్రా జైళ్ల శాఖ డీజీగా బదిలీ అయ్యారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ఆపరేషన్స్ డీజీపీగా ఉన్న డాక్టర్ అనిల్ కుమార్ ను టీజీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీగా నియమించారు. అలాగే, ఇప్పటివరకు ఆర్టీసీ ఎండీగా ఉన్న వై. నాగిరెడ్డి ని పౌరసరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న ఎం. స్టీఫెన్ రవీంద్రను కొత్తగా ఏర్పాటైన తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా నియమించారు. ఫైర్ సర్వీసెస్ డీజీగా ఉన్న విక్రమ్ సింగ్ మాన్ గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ ఆపరేషన్స్ డీజీపీగా, మల్టీజోన్-1 ఐజీగా ఉన్న ఎస్ చంద్రశేఖర్ రెడ్డి ఏసీబీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇంటెలిజెన్స్ ఐజీగా ఉన్న కార్తికేయ ను మల్టీజోన్-1 ఐజీగా, ఐసీసీసీ డైరెక్టర్ అదనపు బాధ్యతలతో నియమించారు.

సజ్జనార్ వంటి కీలక అధికారిని లూప్ లైన్ తరహా విభాగానికి పంపడం, మహేష్ భగవత్, అకున్ సబర్వాల్, చారు సిన్హా, కార్తికేయ వంటి అధికారులకు శాంతిభద్రతలు, ఏసీబీ, ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా రేవంత్ సర్కార్ పోలీసు వ్యవస్థపై తన పట్టును మరింత బిగించినట్లయింది. త్వరలో జరగబోయే పాలనాపరమైన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనల నేపథ్యంలోనే ఈ భారీ బదిలీలకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టమవుతోంది.



హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. వివిధ దేశాల నుంచి వచ్చే రాజకీయ నాయకులు, మేధావులు, విధాన నిర్ణేతలతో జరిగే చర్చలు ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యత తీసుకురానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సామాజిక అసమానతలు, ఆర్థిక అభివృద్ధి, పౌర హక్కులు వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ హాజరైతే ఆయన ప్రసంగం జాతీయ రాజకీయాల్లోనూ ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉంది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్ సర్కార్ మరోవైపు, భారత్ సమ్మిట్‌ను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపును మరింత పెంచడంతో పాటు, తెలంగాణను ప్రపంచస్థాయి చర్చలు, ఆలోచనల మార్పిడి, పెట్టుబడుల ఆకర్షణకు కీలక కేంద్రంగా నిలబెట్టాలని భావిస్తోంది. సుమారు 70 దేశాల ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం రాష్ట్రానికి అంతర్జాతీయంగా తన సామర్థ్యాన్ని చాటుకునే అవకాశంగా మారనుంది. ఈ సదస్సు ద్వారా తెలంగాణలోని అభివృద్ధి అవకాశాలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రపంచ ప్రతినిధులకు వివరించే అవకాశం ఉంది.



రాజకీయాల్లోనూ సందడి?

రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన ఖరారైతే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొనే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో ఆయన భేటీ అవుతారా? పార్టీ అంతర్గత అంశాలపై చర్చిస్తారా? అనే అంశాలపైనా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మొత్తంగా నవంబర్ 13, 14 తేదీల్లో జరగనున్న భారత్ సమ్మిట్ అంతర్జాతీయ స్థాయిలోనే కాకుండా దేశీయ రాజకీయాల పరంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. 70 దేశాల ప్రతినిధుల రాక, రాహుల్ గాంధీ పర్యటనపై నెలకొన్న ఉత్కంఠ, తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఏర్పాట్ల నేపథ్యంలో హైదరాబాద్‌లో జరగనున్న ఈ సదస్సు ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

నమ్మకమైన భాగస్వామితోనే విజయాలు

ముద్ర, విశాఖపట్నం:

నమ్మకమైన వ్యాపార భాగస్వామి ఉంటే విజయాలు తథ్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తన నాయకత్వంలో 8 సీఐఐ భాగస్వామ్య సదస్సులు జరిగాయని.. తనపై నమ్మకంతో ఎందరో పెట్టుబడులకు ముందుకొచ్చారని చెప్పారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో మాట్లాడారు. '2024 జూన్ నుంచి రూ.22.6లక్షల కోట్లకు సంబంధించిన 714 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. రెండున్నరేళ్లలో పెట్టుబడుల్లో పురోగతి సాధిస్తూ వచ్చాం. రూ.7.3 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్‌లో ఉన్నాయి. దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీకి రాష్ట్రం వేదిక. భవిష్యత్తులో కొత్త సంస్కరణలకు తిరుపతి స్పేస్ సిటీ వేదిక కాబోతోంది. త్వరలో డ్రోన్ ఎయిర్‌టాక్సీలు రాబోతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 160 గిగావాట్లను ఏపీ అందించబోతోంది' అని సీఎం పేర్కొన్నారు.

పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలి..

ఈ సదస్సులో సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదనలు చేశారు. పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడు కక్షపూరిత రాజకీయాల నేపథ్యంలో ఇది అవసరమన్నారు. దీనిపై చట్టం చేసి పంపుతామని.. దాన్ని ఆమోదించేలా చూడాలని కేంద్రమంత్రికి సీఎం విన్నవించారు. జాతీయ స్థాయిలో చట్టం చేస్తే మరింత సంతోషిస్తానని చెప్పారు. ఈ తరహా చట్టం చేయగలిగితే అభివృద్ధిలో భారత్ దూసుకెళ్తుందన్నారు.

పేదల అభివృద్ధికి..

పేదకుటుంబాలకు ఆర్థిక సాయం వల్ల మరింత చేయూత అందుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. పేదకుటుంబాలకు చేయూత కోసం ఎంబీకే 10-20 పర్సెంట్ ప్రణాళిక తీసుకొచ్చామన్నారు. ' పేదల అభివృద్ధి కోసం మార్గదర్శి బంగారు కుటుంబం ప్రతిపాదన తీసుకువస్తున్నా. 20 శాతం బడుగు వర్గాలకు 10శాతం ఉన్నత వర్గాలు చేయూత అందించాలి. దీనివల్ల బడుగు వర్గాల జీవన ప్రమాణాలు మారుతాయి. చేయూత లేకపోతే పేద కుటుంబాలు మరింత పేదరికంలోకి వెళ్తాయి. ఉన్నత వర్గాలు, బడుగు వర్గాలకు మధ్య అంతరం మరింత పెరుగుతుంది. చాలా దేశాలు ఈ విధమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. సమానత్వం పాటించడం వల్ల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. సరైన మార్గనిర్దేశం వల్ల ఎంఎస్ఈలు మరింత పుంజుకుంటాయి.

బ్లూ గ్రీన్ సిటీగా అమరావతి

బ్లూ గ్రీన్ సిటీగా అమరావతి రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. పారిశ్రామిక వేత్తలు అమరావతిని రెండో నివాసంగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం ద్వారా నీరు వచ్చేలా కార్యాచరణ చేపట్టాం. గోదావరి-కావేరి లింక్ ద్వారా 5 రాష్ట్రాల దాహార్తి తీర్చే అవకాశం కల్పించాం. విద్యుత్ గ్రిడ్ లాగే వాటర్ గ్రిడ్ కూడా ఉంటే ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుంది. ఏపీలో 25 సెక్టోరల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతిని గ్లోబల్ సెమీ కండక్టర్ చిప్ డిజైన్ క్యాపిటల్‌గా చేస్తాం.

ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలు

పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఎస్క్రో ఖాతా ద్వారా అందిస్తాం. ఇవాళ్టి నుంచే ఎస్క్రోఖాతా పని చేయడం ప్రారంభిస్తుంది. యాక్సెస్ టూ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీ రెండో స్థానంలో ఉంది. సామాజిక, ఆర్థిక భద్రతలో కీలక స్థానం దక్కింది. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వం పని చేస్తోంది. రూ.9.89 లక్షల కోట్ల విలువైన 303 ఎంఓయూలు చేసుకుంటాం. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం. అంతరిక్ష రంగానికి విడిగా రూ.25వేల కోట్లు, ఆహారశుద్ధి రంగంలో రూ.30 వేల కోట్లు, దేశ పోర్టు సరకు రవాణాలో 20 శాతం వాటా లక్ష్యంగా పని చేస్తున్నాం. పోర్టుల సామర్థ్యం, రైలు అనుసంధానం, నౌకా నిర్మాణ క్లస్టర్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం.' అని చంద్రబాబు అన్నారు.



ఇప్పుడంతా ఇన్ స్టా రీల్స్

ముద్ర, న్యూఢిల్లీ:

మీడియాతో తనకు సుదీర్ఘ కాలంగా అనుబంధం ఉందన్నారు ప్రధాని మోదీ. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదన్నారు. విపత్తులు, సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసే రిపోర్టరులు కథనాలకు ఎంతదూరమైనా వెళ్తారని ప్రధాని ప్రశంసించారు. దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టుల కోసం దీపావళి మిలన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మోదీ ప్రసంగించారు.

'విలేకరులతో నాకు సుదీర్ఘకాల అనుబంధం ఉంది. భాజపాలో చేరిన తొలినాళ్లలో మీడియా ఈవెంట్ల కోసం కుర్చీలు వేసే బాధ్యత నాదే. గడిచిన కొన్నేళ్లలో జర్నలిజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి జరిగింది. ఒకప్పుడు మీడియా సమావేశాల ప్రసారం కోసం అవుట్ సైడ్ బ్రాడ్‌కాస్ట్ వ్యాన్లను ఉపయోగించేవారు. ఇప్పుడు మొబైల్ ఫోనే ఈ వాహనంగా మారిపోయింది. గతంలో పత్రికా ప్రకటనలు (ప్రెస్ రిలీజ్‌లు) ఇచ్చేవారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల విస్తృతితో అన్నీ ఇన్‌స్టా రీల్స్‌లోనే తెలిసిపోతున్నాయి'' అని మోదీ వివరించారు.

ఈ సందర్భంగా దేశాభివృద్ధికి తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రధాని వివరించారు. పేదరిక నిర్మూలన కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. 'ఒకప్పుడు గరీబీ హఠావో వంటి నినాదాలు వినిపించేవి. కానీ, మా ప్రభుత్వం గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి బయటపడేసింది' అని మోదీ వెల్లడించారు. దేశంలో అసాధారణ విజయాలు సాధించినవారు ఎంతోమంది ఉన్నారని.. వారి విజయ గాథలను ప్రపంచానికి తెలియజేయాలని విలేకరులను కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

కొత్త పింఛన్లు..


ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నూతన లబ్ధిదారులకు 'చేయూత' పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో మరో 4.5 లక్షల మంది అర్హులకు కొత్తగా పింఛన్లను మంజూరు చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో మంజూరు పత్రాల పంపిణీ ప్రక్రియ కొనసాగనుంది.

అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల వారీగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై లబ్ధిదారులకు స్వయంగా ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్నారు. ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలు, వితంతువులు, దివ్యాంగులు, వృద్ధుల చేతికి మంజూరు పత్రాలు అందడంతో వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ముఖ్యంగా ఈ కొత్త పింఛన్లలో మహిళలకు పెద్దపీట వేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. దరఖాస్తుదారులకు ఏవైనా అభ్యంతరాలు లేదా సాంకేతిక సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేందుకు వేదికల వద్ద ప్రత్యేక కౌంటర్లను కూడా అందుబాటులో ఉంచారు.

మంజూరు పత్రాల పంపిణీ ప్రక్రియ పూర్తయిన వెంటనే, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా 19న నూతన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా పింఛన్ సొమ్మును జమ చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే 1,23,625 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయగా, తాజాగా మంజూరు చేసిన 4.5 లక్షల పింఛన్లతో కలిపి మొత్తం కొత్త లబ్ధిదారుల సంఖ్య 5,73,625కు చేరుకుంది.



కోర్టుకు రేవంత్ రెడ్డి

ముద్ర, హైదరాబాద్ :

గతంలో కరోనా నిబంధనల ఉల్లంఘన కేసులో కోర్టుకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నాంపల్లిలోని మనోరంజన్ ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. 2021లో నాగార్జునసాగర్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో కరోనా నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో అప్పుడు సీఎం రేవంత్ రెడ్డిపై గత పాలకులు కేసు నమోదు చేశారు. అయితే ఆ కేసులో భాగంగా సీఎం కోర్టుకు హాజరయ్యారు. 2021 ఏప్రిల్ 11న నల్గొండ జిల్లా పెద్దపూర మండలం చలకుర్తి గ్రామంలో నాగార్జునసాగర్ ఉప ఎన్నికల భాగంగా ప్రచారం నిర్వహించారు. దీంతో అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. మాస్కులు ధరించకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసు ప్రస్తుతం నాంపల్లిలోని ప్రత్యేక ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉంది. ఈ క్రమంలో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) 313 కింద నిందితుల వాంగ్మూల నమోదు ప్రక్రియ కోసం కేసు విచారణకు రానుంది. దీంతో సీఎం రేవంత్ హాజరయ్యారు.



రూ.50 కోట్ల బంగారం చోరీ

ముద్ర, చెన్నై :

తమిళనాడులోని మదురైలో భారీ చోరీ కలకలం రేపింది. పళంగనాథం ప్రాంతంలోని ప్రముఖ జువెలరీ బ్రాండ్ తనిష్క్ షోరూమ్‌లో దుండగులు అత్యంత చాకచక్యంగా ప్రవేశించి సుమారు రూ. 50 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలను దోచుకెళ్లారు. 15 నుంచి 20 కిలోల వరకు బంగారం చోరీకి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ షోరూమ్ భవన నిర్మాణ పనులు సుమారు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కేవలం 10 నుంచి 15 రోజుల క్రితమే ఈ నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. షోరూమ్ వెనుక వైపు తలుపులు, షట్టర్ తాళాలను పగలగొట్టడంతో పాటు షాపు గోడకు కన్నం వేసి దొంగతనానికి పాల్పడినట్లు నిర్వాహకులు గుర్తించారు.

11వ తేదీ ఉదయం సిబ్బంది షోరూమ్‌కు తిరిగి వచ్చినప్పుడు తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా, ఆభరణాలు మాయమైనట్లు తేలింది. వెంటనే షోరూమ్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు.

పోలీసులు షోరూమ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అందులో ఒకే ఒక్క అనుమానితుడు భవనం పైఅంతస్తులోని లిఫ్ట్ మార్గం (లిఫ్ట్ ష్యాసేజ్) ద్వారా లోపలికి ప్రవేశించినట్లు రికార్డయింది. కొత్తగా ప్రారంభమైన షోరూమ్‌లో నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతుండటాన్ని ఆసరాగా చేసుకుని దొంగ ఈ పథకం వేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 13.11.2026
www.mudranews.in | @mudranews

సిగరెట్‌కు బదులుగా చూయింగ్ గమ్ ప్రయత్నించండి!

సిగరెట్ తాగాలనే కోరిక కలిగినప్పుడు షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్ నమలడం, పండ్లు తినడం లేదా నీళ్లు తాగడం వంటి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.



రూ.2,500 కోట్ల విలువైన భూమి కేటాయింపుల్లో అక్రమాలు

ఏసీబీ విచారణకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాండ్



ముద్ర, హైదరాబాద్: గచ్చిబౌలి మణికొండ జాగీర్ ప్రాంతంలోని 50 ఎకరాల ప్రభుత్వ భూమిని హైదరాబాద్ TNGOs సహకార గృహ నిర్మాణ సంఘానికి కేటాయించిన వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగాయని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆరోపించింది. సుమారు రూ.2,500 కోట్ల విలువైన ఈ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా 622 ప్లాట్లను అనర్హులకు కేటాయించారని పేర్కొంది. ప్లాట్ల కేటాయింపుల పేరుతో ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.4 లక్షలు వసూలు చేసి, ఆ నిధులకు లెక్కలు చూపలేదని ఆరోపించింది. ఈ వ్యవహారంపై 2019లోనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఏసీబీ లేదా సీబీఐ విచారణకు సిఫార్సు చేసినప్పటికీ, ఏడేళ్లుగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెల్లడించింది. సమాచార హక్కు దరఖాస్తులకు ఫైలు ఇంకా సర్క్యులేషన్ లోనే ఉందని సమాధానం ఇస్తున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో కేసును ఏసీబీకి అప్పగించి సమగ్ర విచారణ జరిపించాలని, అనర్హులకు కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి, ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఫోరం అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

పేద చేనేత కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సాయం



ముద్ర, మోత్కూర్: రాపోలు శేషాద్రి సుగుణమ్మ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద చేనేత కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించినట్లు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్ తెలిపారు. నవంబర్ 12న యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఎన్నారై రాపోలు సుదర్శన్, వాసవి దంపతులు ఈ మొత్తాన్ని అందజేశారు. నలుగురు నిరుపేద చేనేత కార్మికులకు మగ్గాల కొనుగోలు కోసం ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు శాంతి కుమార్ వెల్లడించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి చేయూతనిచ్చిన రాపోలు సుదర్శన్ దంపతులకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పోరేటర్ లు సింగిరెడ్డి పద్మారెడ్డి, మద్ది యుగంధర్ రెడ్డి, కంబం కిరణ్ కుమార్ రెడ్డి,బి ఆర్ ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఫైళ్ల సోమిరెడ్డి, డా గుర్రం లక్ష్మీ నర్సింహారెడ్డి, సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, జిల్లా పద్మశాలి సంఘం నాయకులు గంగుల రాములు, చేనేత సంఘం అధ్యక్షుడు వంగరి రాములు,నాయకులు రాపోలు పరంధాములు,పోచం శ్రీను, మంచే గోవర్ధన్, అమరెందర్, పోచం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ఇంటర్వ్యూకు తెలంగాణ నుంచి 31 మంది ఎంపిక

ముద్ర, హైదరాబాద్ : రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం సత్ఫలితాలను అందిస్తోంది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో తెలంగాణకు చెందిన 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ప్రిలిమ్స్ లో అర్హత సాధించిన 158 మందికి ఇప్పటికే సింగరేణి సంస్థ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.1.58 కోట్ల ఆర్థిక సాయం అందించింది. తాజాగా ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మందికి మరో రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం ఇవ్వనుంది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఇంటర్వ్యూలోనూ విజయం సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా, ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 27 మంది సివిల్ సర్వీసెస్ కు ఎంపికయ్యారు.

ఇక ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

1100 టోల్‌ఫ్రీ నంబర్‌తో మీ-సేవ డోర్‌స్టెప్ డెలివరీ



ముద్ర, హైదరాబాద్ : ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మీ-సేవ డోర్‌స్టెప్ డెలివరీ కార్యక్రమాన్ని విస్తరిస్తోంది. ఇందులో భాగంగా సైబరాబాద్ పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, మీ-సేవ, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుల, ఆదాయ, EWS, OBC సర్టిఫికెట్లు తదితర సేవలను ఇంటి వద్దే పొందవచ్చని మీ-సేవ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. ఈ సేవలు వృద్ధులు, ఐటీ ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. సృజన, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పాల్గొని, డోర్‌స్టెప్ సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని రెసిడెన్షియల్ అసోసియేషన్లకు పిలుపునిచ్చారు.

ఏనుగు బీభత్సం.. ఏడు నెలల్లో 16 మందిని తొక్కిచంపింది

ముద్ర, ముంబై: ఛత్తీస్‌గఢ్‌లో ఓ ఏనుగు హడలెత్తిస్తోంది. సూరజ్‌పుర్ జిల్లాలో తాజాగా ఈ గజరాజు దాడిలో ఓ మహిళ (45) ప్రాణాలు కోల్పోయింది. దీంతో కలుపుకొని సూరజ్‌పుర్, బల్‌రామ్‌పుర్ జిల్లాల్లో గత 6-7 నెలల వ్యవధిలో ఈ ఏనుగు 16 మందిని తొక్కిచంపిందని అటవీశాఖ అధికారులు వెల్లడించారు. స్థానికులు 'కబ్రా కాన్'గా పిలుచుకునే ఈ ఒంటరి గజరాజుకు రేడియో కాలర్ అమర్చేందుకు ఉన్నతాధికారులు తాజాగా అనుమతి ఇచ్చారని తెలిపారు.

నవంబర్ 16న జాతీయ పత్రికా దినోత్సవం

ఘనంగా నిర్వహించాలని IJU పిలుపు
మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రతపై చర్చలు
PCI భద్రతా మార్గదర్శకాలపై IJU అసంతృప్తి
జర్నలిస్టుల హక్కులను కాపాడాలని డిమాండ్



విజయవాడ / చండీగఢ్: నవంబర్ 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ పత్రికా దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపునిచ్చింది. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) 1966 నవంబర్ 16న కార్యకలాపాలు ప్రారంభించి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ఏడాది పత్రికా దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ, సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

మీడియా స్వేచ్ఛ, జర్నలిజంలో నైతిక విలువల పరిరక్షణ, వృత్తి ప్రమాణాల పెంపు, జర్నలిస్టుల భద్రత వంటి అంశాలపై పీసీఐ తన బాధ్యతలను సమీక్షించుకోవాల్సిన సందర్భమిదని వారు తెలిపారు. జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులు, పౌరసమాజ ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు.

పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, వర్కింగ్ జర్నలిస్టులకు మెరుగైన పని పరిస్థితులు, మీడియా సిబ్బంది రక్షణ, మహిళా జర్నలిస్టులకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించడం వంటి కీలక అంశాలపై చర్చించాలని సూచించారు.

ఇటీవల పీసీఐ జారీ చేసిన జర్నలిస్టుల భద్రతా మార్గదర్శకాలపై ఐజేయూ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు పోలీసుల ద్వారా రక్షణ కల్పించాల్సింది పోయి, నిరసనలకు సురక్షిత దూరంలో ఉండాలని, లాఠీచార్జీల సమయంలో తప్పించుకునే మార్గాలను ముందుగానే చూసుకోవాలని సూచించడం సరికాదన్నారు. ఇది క్షేత్రస్థాయిలో వార్తలు సేకరించడం జర్నలిస్టుల ప్రాథమిక బాధ్యత అనే విషయాన్ని విస్మరించడమేనని పేర్కొన్నారు. పీసీఐ తన చట్టబద్ధమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని వారు డిమాండ్ చేశారు.

ఓటరు జాబితా పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్‌లు

ముద్ర, హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు పురపాలక శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేటకు ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్ కర్నూల్‌కు రవాణ శాఖ కార్యదర్శి కె.ఇలంబరితి పరిశీలకులుగా నియమితులయ్యారు.

జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి బి.విజేంద్రను పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించింది. పరిశీలకులుగా కనీసం మూడు సార్లు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించి నిబంధనల ప్రకారం పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ జరుగుతుందో లేదో పరిశీలించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నివేదించాలని ఈసీ తెలిపింది. జిల్లా కేంద్రాలతో పాటు గ్రామాలకూ వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘాలతో సమావేశమై పరిశీలించాలని స్పష్టం చేసింది.

శబరిమలకు 54 ప్రత్యేక రైళ్లు

ముద్ర, హైదరాబాద్: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు శుభవార్త. భక్తుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే 54 ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు ఈ రైళ్లు నడుపనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ రైళ్లు నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లోని పలు తేదీల్లో సర్వీసులందిస్తాయని పేర్కొన్నారు.

కీసర లంచం కేసులో బిగ్ ట్విస్ట్..

ముద్ర, హైదరాబాద్: మూడు రోజుల క్రితం రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కీసర ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసుకు, గతంలో జరిగిన రూ.20 లక్షల లంచం బాగోతానికి లింక్ ఉన్నట్లు తేలడంతో మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్, ఏసీబీ వర్గాలు అవాక్కయ్యాయి. కీసర పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన సుధాకర్ యాదవ్ (పేరు మార్చాం)పై ఈ ఏడాది ఫిబ్రవరిలో భూ వివాదంలో చీటింగ్ కేసు (ఎఫ్ఐఆర్ నెం.180/2026), జులైలో 498-ఏ కింద మరో కేసు (ఎఫ్ఐఆర్ నెం.736/2026) నమోదయ్యాయి. ఈ రెండు కేసుల్లో అరెస్ట్ చేయకుండా ఉండేందుకు అప్పటి ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, ఆయన సన్నిహిత ఎస్ఐ కలిసి సుధాకర్ యాదవ్ వద్ద రూ.20 లక్షలు లంచం వసూలు చేశారు. అయితే, రూ.20 లక్షలు తీసుకున్నప్పటికీ పోలీసులు సుధాకర్ యాదవ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడంతో ఆయన కుటుంబ సభ్యులు నిలదీశారు. దీంతో ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు రూ.10 లక్షలు వెనక్కి ఇవ్వగా, మిగిలిన రూ.10 లక్షలను ఆ సన్నిహిత ఎస్ఐ ఉంచుకుని కేసులో మరో విధంగా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు వేరే ఏసీబీ కేసులో చిక్కి జైలుకు వెళ్లడం, సదరు ఎస్ఐ మరో ఠాణాకు బదిలీ కావడంతో ఈ వ్యవహారం ఆగిపోయింది. తాజాగా ఈ రెండు కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని కోరుతూ బాధితుడు ప్రస్తుత దర్యాప్తు అధికారి ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్‌ను కలిసి గతంలో ఇచ్చిన రూ.20 లక్షల విషయాన్ని వివరించాడు. 'వాళ్లకు ఇచ్చావు సరే, నా వాటా నాకు ఇస్తేనే అనుకూలంగా చార్జిషీట్ వేస్తా' అంటూ శ్రీనివాస్ బెదిరించడంతో విసిగిపోయిన బాధితుడు ముగ్గురు అధికారుల లంచాల బాగోతంపై ఏసీబీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎస్ఐ శ్రీనివాస్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోగా, ఫిర్యాదులోని మిగతా రూ.20 లక్షల అంశంపైనా లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకొచ్చాం

నవంబర్ 14న రాహుల్ గాంధీ పాల్గొనే గిగ్ వర్కర్ల ర్యాలీని విజయవంతం చేయాలి
ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు.. క్యాబ్, ట్యాక్సీ, ర్యాపిడో కార్మికులకూ ప్రత్యేక చట్టం
మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



ముద్ర, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజాపాలన ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నవంబర్ 14న హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టనున్న ర్యాలీలో నగరవ్యాప్తంగా ఉన్న గిగ్ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఫహీం ఖురేషితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా పెరగని ఆటో ఛార్జీలను పెట్రోల్, డీజిల్ ధరలకు అనుగుణంగా పెంచినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ల చిరకాల డిమాండ్ అయిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని, ఇందుకు సంబంధించి చట్టబద్ధమైన చర్యలు ప్రారంభించిందని వెల్లడించారు. క్యాబ్, ట్యాక్సీ, ర్యాపిడో వంటి అగ్రిగేటర్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కూడా ప్రత్యేక చట్టం తీసుకురానున్నట్లు ప్రకటించారు.

మహిళా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు

మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలను పోషించుకునేలా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం

గ్రామీణ ప్రాంతాల్లో రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని, సుమారు రెండున్నర లక్షల మంది లబ్ధిదారులు దీపావళి పండుగను కొత్త ఇళ్లలో జరుపుకున్నారని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పేదలు, నిరుద్యోగుల కోసం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

ఎకరం రూ.100 కోట్ల విలువ చేసే ఖరీదైన ప్రాంతాల్లో సైతం పేదల కోసం ఇళ్లు నిర్మిస్తున్నామని, ఆర్టీసీ, పోలీస్ శాఖలకు చెందిన స్థలాల్లోనూ గృహ నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలు పనిచేసే ప్రాంతాలకు సమీపంలోనే నివసించేలా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు రవాణా రంగంలో పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగరం ఢిల్లీ తరహాలో కాలుష్య సమస్యను ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో రెట్రోఫిట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

నల్లగొండ ఎఐకేఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి: ఎండీ జహంగీర్



ముద్ర, తెలంగాణ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జహంగీర్ విమర్శించారు. ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఎఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆత్మకూరు మండలంలోని ప్రధాన రహదారిపై జాతీయ మహాసభల ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం జహంగీర్ మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా పంటలకు ధరలు లభించక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు, అసమాన మార్కెట్ వ్యవస్థ, ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు.

రైతాంగ హక్కుల సాధన కోసం ఎఐకేఎస్ నిరంతరం పోరాడుతోందని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు సమగ్ర విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా 950 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరుకానున్నారని తెలిపారు. భవిష్యత్తులో రైతు సమస్యలపై చేపట్టాల్సిన పోరాట కార్యాచరణపై మహాసభల్లో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ నెల 15న నల్లగొండ ఎన్జీ కళాశాల ఆవరణలో నిర్వహించే బహిరంగ సభ, ప్రదర్శనకు రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ దాసరి పాండు మండల కార్యదర్శి వేముల బిక్షం రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు వి గోపాల్ రెడ్డి రైతు సంఘం మండలకార్యదర్శి తుమ్మల సత్యనారాయణరెడ్డి మండల కమిటీ సభ్యులు మల్లెల శ్రీశైలం కందాల వెంకటరెడ్డి నాయిని యాదిరెడ్డి ఏపూరి బుగ్గ రాము లుతదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
గురువారం, 12 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..



వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

రామాయణం ఒక సినిమా కథ మాత్రమే కాదు. అది భారతీయుల సామూహిక స్మృతిలో భాగం. కోట్లాది కుటుంబాల విశ్వాసం. తరతరాలుగా ధర్మం, కర్తవ్యం, త్యాగం, మానవ సంబంధాల గురించి చెప్పిన మహాకావ్యం. అలాంటి రామాయణాన్ని వెండితెరకు తీసుకురావడం అంటే కేవలం భారీ సెట్లు, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, స్టార్ నటీనటుల సమీకరణ కాదు. అంతకంటే ముందు ఉండాల్సింది మూలకథ పట్ల బాధ్యత, ప్రజల విశ్వాసాల పట్ల గౌరవం.



కొలను వెంకటేశ్వర రెడ్డి

రామాయణ్ పేరుతో..
మూల కథకు ముప్పేనా..?!

అయితే నేడు రామాయణం పేరుతో రూపొందుతున్న భారీ చిత్రాలపై వస్తున్న ప్రశ్నలు మరింత తీవ్రమైనవి. వేల కోట్ల రూపాయల పెట్టుబడి, వేలాది తెరల్లో ప్రదర్శన, ప్రపంచ వ్యాప్త మార్కెట్, ఈ లెక్కల మధ్య అసలు రామాయణం ఎక్కడ ఉంది? పెట్టుబడి ఎంత? వసూళ్లు ఎంత? విదేశీ మార్కెట్ ఎంత? VFX ఎంత అద్భుతంగా ఉంది? అన్న లెక్కలే వినిపిస్తున్నాయి. కానీ ఈ ప్రాథమిక ప్రశ్నకు సమాధానం ఎవరు చెప్పాలి? రామాయణం పేరుతో ఎంతవరకు కల్పన చేయవచ్చు? సృజనాత్మక స్వేచ్ఛ తప్పనిసరిగా ఉండాలి. సినిమాను యథాతథంగా పుస్తకంలా చిత్రీకరించాల్సిన అవసరం లేదు. కొత్త తరానికి చేరువ చేయడానికి కొత్త కథన పద్ధతులు కూడా అవసరమే. కానీ స్వేచ్ఛ అంటే మూల స్వరూపాన్ని తారుమారు చేసే హక్కా? పాత్రల స్వభావాలను పూర్తిగా మార్చే అధికారం దానిలో భాగమేనా?

సీత పాత్రను కొత్త కోణంలో చూపవచ్చు. రావణుడి శక్తిని, వ్యక్తిత్వాన్ని ప్రభావవంతంగా ఆవిష్కరించవచ్చు. రాముడి మానవీయ కోణాలను కూడా చూపవచ్చు. కానీ వీటన్నింటి పేరుతో మహాకావ్యంలోని నైతిక, తాత్విక సమతుల్యతను మార్చేస్తే అది కేవలం 'అడాప్టేషన్' గానే మిగులుతుందా? లేక ప్రజల మనసుల్లో ఉన్న మూలకథనాన్ని కొత్త రూపంలో ప్రతిష్ఠించే ప్రయత్నమవుతుందా? వేల కోట్ల రూపాయల సినిమా కాబట్టి ప్రశ్నించకూడదా? భారీ స్టార్ తారాగణం ఉంది కాబట్టి విమర్శించకూడదా? ప్రపంచస్థాయి VFX ఉందని మూలకథకు సంబంధించిన సందేహాలను పక్కన పెట్టాలా? ఇదే ప్రశ్న ప్రేక్షకుల నుంచి వస్తోంది.

మరో ముఖ్యమైన అంశం సెన్సార్ వ్యవస్థది

CBFC పని కళాత్మకతను శాసించడం కాదు. భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడం కూడా కాదు. కానీ కోట్లాది ప్రజల విశ్వాసాలతో ముడిపడిన అంశాలను పరిశీలించేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం కాదా? వివాదం వచ్చిన తరువాత స్పందించడం కంటే, ముందే బాధ్యతాయుతమైన పరిశీలన అవసరం కాదా? ప్రభుత్వాలు కూడా ప్రతి వివాదాస్పద చిత్రాన్ని నిషేధించడం పరిష్కారమని భావించకూడదు. ప్రజాస్వామ్యంలో నిషేధం చివరి మార్గం కావాలి. అయితే ప్రజల ఆందోళనలను "సృజనాత్మక స్వేచ్ఛ" అనే ఒక్క మాటతో కొట్టిపారేయడం కూడా సరికాదు. రామాయణం VFX వ్యాపారం మాత్రమే కాదు, భారతీయ నాగరికతలో భాగమైన సాంస్కృతిక వారసత్వం. దానిపై కొత్త వ్యాఖ్యానం ఉండవచ్చు. కొత్త దృక్కోణం ఉండవచ్చు. కానీ మూల విలువలనే గుర్తుపట్టలేని స్థాయికి మార్చితే ప్రశ్నలు తప్పవు. కళకు స్వేచ్ఛ కావాలి, కానీ స్వేచ్ఛకు బాధ్యత కూడా ఉండాలి. వ్యాపారానికి లాభం కావాలి, కానీ లాభం కోసం వారసత్వాన్ని తాకట్టు పెట్టకూడదు. రామాయణాన్ని ఎంత గొప్పగా చిత్రీకరించామన్నది VFX నిర్ణయించదు. రామాయణం ఆత్మను ఎంతవరకు నిలబెట్టామన్నదే అసలు ప్రమాణం.





ప్రోటీన్ పొడర్‌లకు బదులుగా
ఇవి తీసుకోండి

ప్రోటీన్ పొడర్‌లకు బదులుగా, ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తీసుకోవాలి. సిక్స్ ప్యాక్‌ల కోసం, దృఢమైన కండరాల కోసం వ్యాయామం చేసే వారు ఎక్కువ ప్రోటీన్లు తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. అందులో భాగంగా బలం కోసం చికెన్ తింటారు. అదనంగా, వారు ఖరీదైన ప్రోటీన్ పొడర్లను పొందుతారు. ప్రోటీన్ షేక్స్ తాగుతారు. కానీ ఇంట్లో లభించే కొన్ని ఆహార పదార్థాలను ఉపయోగించడం వల్ల ప్రోటీన్ పొడర్లు అవసరం లేదని ఫిట్‌నెస్ నిపుణులు చెప్తున్నారు. ఆ పదార్థాలు ఏమిటో తెలుసుకుందాం.

పెసర్లు: పొట్టు తీయని పెసరలు, పెసర పప్పులలో అత్యధిక మొత్తంలో మొక్కల ఆధారిత ప్రోటీన్లు ఉంటాయి. హెనిలాలనైన్, లూసిన్, ఐసోలూసిన్, వాలైన్, లైసిన్, అర్జినైన్ వంటి అమైనో ఆమ్లాలు కూడా వీటిలో కనిపిస్తాయి. ఇవన్నీ కండరాలను దృఢంగా మార్చడంలో సహాయపడతాయి.

వేరుశెనగ: వేరుశెనగలో ఇతర విత్తనాల కంటే ఎక్కువ ప్రోటీన్లు ఉంటాయి. మొత్తం 20 రకాల అమైనో ఆమ్లాలు వివిధ శాతాల్లో కనిపిస్తాయి. ఇందులో అర్జినైన్ ప్రోటీన్ పెద్ద మొత్తంలో ఉంటుంది. రోజూ ఒక గుత్తి బల్లులను తినడం వల్ల మన ప్రోటీన్ అవసరాలు తీరుతాయి. ఇంకా వేరుశెనగ వెన్న కూడా ఉపయోగించవచ్చు.

పనీర్: కాబట్టి మీరు ఎక్కువ ప్రోటీన్ ఫుడ్స్ తినాలనుకుంటే, పనీర్ ఒక ఎంపిక. అలాగే ఇది తక్కువ ధరకే లభిస్తుంది. దీని కోసం పాలు, పెరుగు కూడా ఉపయోగించవచ్చు. అలాగే సోయాతో చేసిన టోఫులో కూడా ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి.

పప్పుధాన్యాలు: పండుగల సమయంలో దేవతలకు ప్రసాదంగా శెనగలు తయారుచేస్తారు. పప్పు ధాన్యాలు తీసుకోవడం మంచిది. చియా విత్తనాలు: చియా గింజల్లో పీచు ఎక్కువగా ఉండటమే కాకుండా ప్రోటీన్లు కూడా ఎక్కువగా ఉంటాయి. రెండు టేబుల్ స్పూన్ల ఈ గింజలను నానబెట్టి తింటే నాలుగు గ్రాముల వరకు ప్రోటీన్లు అందుతాయి. వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా పుష్కలంగా ఉంటాయి.



సీతాఫలం గింజలతో నల్లటి జుట్టు

ఆయుర్వేద వైద్యులు ఏం చెప్తున్నారు?

చలికాలంలో లభించే సీతాఫలం రుచితో పాటు ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలను అందిస్తుంది. సీతాఫలం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు, గింజల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తినడానికి సమయం గురించి తెలుసుకోండి.



చలికాలం ప్రారంభం కావడంతో మార్కెట్లోకి సీతాఫలాలు వచ్చేస్తున్నాయి. తియ్యటి, ప్రత్యేకమైన సువాసనతో ఉండే ఈ పండును చాలామంది ఇష్టంగా తింటారు. సీతాఫలం కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు.. శరీరానికి అవసరమైన పలు పోషకాలను అందించే పండుగా గుర్తింపు పొందింది. ఆయుర్వేదంలోనూ సీతాఫలానికి ప్రత్యేక స్థానం ఉంది. అడవులు, పొలాల పరిసరాల్లో సహజంగా పెరిగే ఈ మొక్కలోని ఔషధ గుణాలు, పండును తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి సావర్‌కుండ్లాలోని వేద ఆయుర్వేద ఆసుపత్రికి చెందిన వైద్యుడు బలభద్ర మెహతా వివరించారు.

ఆయుర్వేదం ప్రకారం..

వైద్యుడు బలభద్ర మెహతా తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫలం సహజంగా అడవులు, వన ప్రాంతాల్లో పెరిగే మొక్క. సీతాఫలాన్ని కేవలం పండుగా మాత్రమే కాకుండా, సంప్రదాయ ఆయుర్వేదంలో పేర్కొన్న ఔషధ గుణాల కారణంగా ప్రత్యేకంగా చూస్తారు. ఆయుర్వేద నమ్మకాల ప్రకారం సీతాఫలం పిత్త దోషాన్ని శాంతింపజేయడంలో ఉపయోగపడుతుందని భావిస్తారు. అలాగే కఫ, వాత దోషాల సమతుల్యతకు దీనిలోని గుణాలు తోడ్పడతాయని చెబుతారు. అయితే ఈ ప్రభావాలు ఒక్కొక్కరి శరీర తత్వం, ఆరోగ్య పరిస్థితిని బట్టి మారవచ్చు.

జుట్టుకు ప్రయోజనమా?

సీతాఫలం గింజల సంప్రదాయ వినియోగం గురించి వైద్యుడు బలభద్ర మెహతా వివరించారు. పూర్వం సీతాఫలం గింజలను ఎండబెట్టి జుట్టు సంరక్షణ కోసం ఉపయోగించే వారని తెలిపారు. అయితే ఈ గింజలతో జుట్టు నల్లబడుతుందని, జుట్టు సమస్యలన్నీ తగ్గుతాయని చెప్పడానికి తగిన ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేవు. ముఖ్యంగా సీతాఫలం గింజలను పొరపాటున నమిలి తినకూడదు. నిపుణుల సలహా లేకుండా వాటిని ఇంటి చిట్కాల రూపంలో తలకు లేదా చర్మానికి ఉపయోగించకూడదు. గింజల్లోని కొన్ని పదార్థాలు కళ్లకు, చర్మానికి హాని కలిగించే అవకాశం ఉంది.

సీతాఫలం తినడానికి సరైన సమయం

సీతాఫలాన్ని ఉదయం లేదా మధ్యాహ్నం తీసుకోవడం మంచిదని భావిస్తారు. సమతుల ఆహారంలో భాగంగా తగిన పరిమాణంలో తింటే శరీరానికి శక్తి, పోషకాలు అందుతాయి. అయితే మధుమేహం ఉన్నవారు సీతాఫలంలోని సహజ చక్కెరలను దృష్టిలో ఉంచుకోవాలి. తమ రక్తంలో చక్కెర స్థాయిలు, ఆహార నియమాలకు అనుగుణంగా ఎంత పరిమాణంలో తీసుకోవాలో వైద్యుడిని సంప్రదించాలి. ఏ ఆహారమైనా అతిగా తీసుకోవడం మంచిది కాదు.

చలికాలంలో లభించే సీతాఫలం రుచితో పాటు పోషకాలను అందించే మంచి సీజనల్ పండు. అయితే దీనికి సంబంధించిన ఔషధ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకునేటప్పుడు శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల సూచనలను కూడా గుర్తుంచుకోవాలి.

భారత్‌ను వణికిస్తున్న
ఫ్యాటీ లివర్ !

ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని వేధిస్తున్న సమస్య నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్.. నిజానికి భారత్ లో షుగర్ కేసులు ఎక్కువగా ఉండేవి. చాలా భయపట్టేవి కూడా ఇప్పుడు ఈ ఫ్యాటీ లివర్ కేసులు చాలా ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎటువంటి హెచ్చరికలు లేకుండా నిశ్శబ్దంగా కాలేయాన్ని దెబ్బతీస్తుంది. అయితే, కొన్ని రాత్రిపూట లక్షణాల ద్వారా ఈ వ్యాధిని ముందుగానే గుర్తించే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కరెక్ట్ టైంలో కాని రియాక్ట్ అయితే కాలేయాన్ని కాపాడుకోవచ్చు.

ఫ్యాటీ లివర్ వ్యాధి ఉన్నవారిలో రాత్రివేళ కొన్ని నిర్దిష్ట లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. కాలేయ వాపు వల్ల కలిగే అసౌకర్యం లేదా శరీరం నుంచి విషపదార్థాలను బయటకు పంపడంలో కాలేయం విఫలమవడం వల్ల నిద్ర పట్టకపోవడం, మధ్యమధ్యలో మెలకువ రావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. రక్తంలో గ్లూకోజ్ ను మ్యానేజ్ చెయ్యడం కాలేయానికి కష్టంగా మారుతుంది.

రాత్రిపూట తీవ్రమయ్యే కడుపు నొప్పి

కుడివైపు పైభాగంలో కడుపులో అసౌకర్యంగా లేదా నొప్పిగా అనిపించడం ఫ్యాటీ లివర్ వ్యాధి సాధారణ లక్షణం. ఎక్కువ అలిసిపోవడం కడుపు నొప్పి.. యూరిన్ కలర్ మారిపోవడం లాంటివి వెంటనే గమనించి డాక్టర్ ను కలవాలి. ఆకలి తగ్గుతుంది. అంతేకాదు మెదడు పనితీరు కూడా తగ్గుతుంది. కాళ్లు, పాదాలలో వాపు వస్తుంది. కాలేయ పనితీరు మందగించడం వల్ల శరీరంలో ద్రవాలు నిలిచిపోయి కాళ్లు, పాదాలలో వాపు రావచ్చు

రోజుకు 15ని. ఇలా చేస్తే చాలు

జిమ్‌కి వెళ్లే టైం లేదా? పర్ఫెక్ట్ ఫిట్‌నెస్ మీ సొంతం!

ఫిట్‌గా ఉండాలంటే రోజూ గంటల తరబడి జిమ్‌లో గడపాల్సిన అవసరం లేదు. రోజుకు 15 నిమిషాలు కేటాయిస్తూ, సరైన వ్యాయామ ప్రణాళికను అనుసరిస్తే శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. వారానికి 4 లేదా 6 రోజుల పాటు ఏయే వ్యాయామాలు చేయాలి? ఆహారం, నిద్ర విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోండి.

శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవాలని చాలామందికి ఉంటుంది. అయితే ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ పనుల కారణంగా వ్యాయామానికి సమయం కేటాయించలేక పోతుంటారు. ఫిట్‌గా ఉండాలంటే ప్రతి రోజూ గంటల తరబడి జిమ్‌లో గడపాల్సిన అవసరం లేదని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. సరైన ప్రణాళికతో తక్కువ సమయంలోనూ వ్యాయామం చేయవచ్చని సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

ప్రతిరోజూ వ్యాయామం చేయాలనే నియమం లేదు. వారంలో నాలుగు రోజులు శరీరంలోని వివిధ భాగాలకు సంబంధించిన వ్యాయామాలు చేసి, మిగిలిన రోజుల్లో విశ్రాంతి తీసుకోవచ్చు. మొదటి రోజు ఫైభాగంలోని కండరాలకు, రెండో రోజు కాళ్లు, తొడలకు సంబంధించిన వ్యాయామాలు చేయాలి. మూడో రోజు చేతుల కండరాలకు, నాలుగో రోజు భుజాలకు సంబంధించిన వ్యాయామాలు చేయవచ్చు. వీటితో పాటు పొట్ట కండరాల కోసం ప్రాథమిక వ్యాయామాలు కూడా చేర్చుకోవచ్చు.

కండరాలను బలోపేతం చేసుకోవాలనుకునే వారు వ్యాయామాలను విడివిడిగా ప్రణాళిక చేసుకోవచ్చు. మొదటి రోజు ఛాతీ, ట్రైసెప్స్ వ్యాయామాలు, రెండో రోజు వీపు, బైసెప్స్ వ్యాయామాలు చేయవచ్చు. మూడో రోజు స్క్వాట్స్ వంటి కాళ్ల వ్యాయామాలు, నాలుగో రోజు భుజాలకు సంబంధించిన వ్యాయామాలు చేయాలి. కొవ్వు తగ్గించుకోవాలనుకునేవారు తమ శక్తికి అనుగుణంగా వ్యాయామాల తీవ్రతను పెంచుకోవచ్చు. అయితే మధ్యలో తగినంత విశ్రాంతి తీసుకోవడం కూడా ముఖ్యం.

ఎక్కువ సమయం లేని వారు రోజుకు కనీసం 15 నిమిషాలు వ్యాయామం కోసం కేటాయించవచ్చు. వారంలో 6 రోజులు వేర్వేరు శరీర భాగాలకు సంబంధించిన వ్యాయామాలు చేయవచ్చు. మొదటి రోజు ఛాతీ, రెండో రోజు వీపు, మూడో రోజు కాళ్లు, నాలుగో రోజు భుజాలు, ఐదో రోజు చేతులు, 6వ రోజు పొట్ట కండరాలకు సంబంధించిన వ్యాయామాలు చేయవచ్చు. ఏడో రోజు పూర్తిగా విశ్రాంతి తీసుకోవచ్చు. అయితే వ్యాయామాల సంఖ్య, తీవ్రత వ్యక్తి వయస్సు, ఆరోగ్య పరిస్థితి, శారీరక సామర్థ్యాన్ని బట్టి మారాలి. కొత్తగా వ్యాయామం ప్రారంభించేవారు తక్కువ తీవ్రతతో మొదలుపెట్టి పెంచుకోవాలి. అవసరమైతే ఫిట్ నెస్ నిపుణులు లేదా వైద్యుల సలహా తీసుకోవాలి.

ఫిట్‌గా ఉండటం ఒక్కరోజులో సాధ్యమయ్యే విషయం కాదు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు సమతుల ఆహారం తీసుకోవాలి. తగినంత నిద్రపోవాలి. శరీరానికి విశ్రాంతి ఇవ్వాలి. సమయం లేదనే కారణంతో వ్యాయామాన్ని పూర్తిగా పక్కన పెట్టకుండా, రోజులో కొద్దిసేపైనా శారీరక చురుకుదనానికి కేటాయించడం ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడుతుంది.



మహిళల్లో మధుమేహం


ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయంటే?

మధుమేహం అనేది చాలా కాలంగా ప్రజలను వేధిస్తున్న ఆరోగ్య సమస్య. ఎందుకంటే మనం చాలా కార్బోహైడ్రేట్లను తిన్నప్పుడు, వాటిని శక్తిగా మార్చే ప్రక్రియలో ఇన్సులిన్ సహకారం తగ్గుతుంది. ఏటా దాదాపు 10 లక్షల మంది మధుమేహంతో ప్రాణాలు కోల్పోతున్నారు. అంటే అది మన ఆరోగ్యంపై ఎంత ప్రభావం చూపుతుందో అర్థం చేసుకోవచ్చు.

అలాంటి మధుమేహం మహిళల్లో ఎలా ఏర్పడుతుంది.. అనేది తెలుసుకుందాం. మహిళలు ఈ వ్యాధి లక్షణాలపై మరింత అవగాహన కలిగి ఉండాలి. మహిళలు సాధారణ ఆహారం తీసుకున్నా బరువు వున్నట్టుండి తగ్గుతారు. ఇన్సులిన్ సహకారం లేకపోవడం వల్ల గ్లూకోజ్ కణాలలోకి ప్రవేశించదు. ఆ సమయంలో శరీరం శక్తి కోసం కండరాలను విచ్ఛిన్నం చేస్తుంది. దానిని శక్తిగా మారుస్తుంది. దీనివల్ల వేగంగా బరువు తగ్గుతారు. అధిక దాహం, తరచుగా మూత్రవిసర్జన మధుమేహం ప్రారంభ లక్షణాలు.

రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు, మూత్ర నాళాలు వాటిని ఫిల్టర్ చేయడానికి మరింత కష్టపడతాయి. అందుకే ఎక్కువ నీరు తాగాలని అనిపిస్తుంది. తరచుగా మూత్ర విసర్జన చేయవలసి ఉంటుంది. ఒక్కోసారి రాత్రిళ్లు పదే పదే బాత్‌రూంకి వెళ్లాల్సి వచ్చేంత ఇబ్బందిగా ఉంటుంది. దీని వల్ల నిద్ర చెదిరిపోయి నీరసంగా అనిపిస్తుంది. ఒకవైపు మంచి ఆహారం తీసుకున్నా శరీరానికి కావాల్సిన శక్తి అందడం లేదు. దీనివల్ల ఎక్కువ ఆహారం కావాలి. ఫలితంగా, మీరు ఎల్లప్పుడూ ఆకలితో ఉంటారు. తిన్న వెంటనే, మీకు మళ్లీ ఏదైనా తినాలనే కోరిక కలుగుతుంది.

కొందరిలో చూపు మందగిస్తుంది. అలసటగా, నీరసంగా అనిపిస్తుంది. చేతులు, కాళ్లు తిమ్మిరిపోవడం జరుగుతుంది. ఏదైనా దెబ్బలు తగిలితే త్వరగా మానవు. అంటువ్యాధులు, గాయాలు సులభంగా నయం కావు. మధుమేహం లక్షణాలు ఉన్నవారిలో రక్త ప్రసరణ సరిగా జరగదు. ఇలాంటి లక్షణాలు మహిళల్లో కనిపిస్తే వెంటనే వెద్యుడిని సంప్రదించడం మంచిది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 13.11.2026
www.mudranews.in | @mudranews

వ్యాయామం, ధ్యానంతో ఒత్తిడిని తగ్గించుకోండి

ఒత్తిడి వచ్చినప్పుడు సిగరెట్ తాగాలనిపిస్తే నడక, వ్యాయామం, యోగా, ధ్యానం ప్రయత్నించాలి. ఇవి ఆందోళనను తగ్గించి స్మోకింగ్ కోరికను నియంత్రించడంలో సహాయపడతాయి.



భారీ పోలీస్ బందోబస్తు మధ్య

కేపీహెచ్‌బీ భూముల వేలం

హైకోర్టు ఆదేశాలతో ఫేజ్-3 స్థలానికి తాత్కాలిక ఊరట

ముద్ర, కూకట్‌పల్లి : తీవ్ర రాజకీయ వ్యతిరేకత, స్థానిక నివాసితుల ఆందోళనలు, భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) కాలనీలోని ఖాళీ స్థలాల బహిరంగ వేలం ప్రక్రియను తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ) గురువారం నిర్వహించింది. అయితే, ఫేజ్–3లోని వివాదాస్పద 2,696 చదరపు గజాల స్థలం వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించడంతో స్థానిక సంక్షేమ సంఘాలు, కాలనీవాసులకు తాత్కాలిక ఊరట లభించింది.అక్టోబర్ 30న విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్ ప్రకారం, గురువారం ఉదయం 11 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీలోని హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్‌లో 'ఉన్నది ఉన్నట్లుగా' పద్ధతిలో అధికారులు బహిరంగ వేలాన్ని ప్రారంభించారు. స్థానికులు, విపక్ష నేతల నుంచి ఆందోళనలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో ఇంటెలిజెన్స్ మరియు శాంతిభద్రతల విభాగం పోలీసులు వేలం కేంద్రం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేలంలో ఫేజ్–3లోని మలేషియన్ టౌన్‌షిప్ సర్కిల్ సమీపంలో (ఫోరం మాల్ ఎదురుగా, చేపల మార్కెట్ పక్కన) ఉన్న 2,696 చదరపు గజాల స్థలం ప్రధాన వివాదాస్పదంగా మారింది. గజానికి ₹1.75 లక్షల కనీస ధర (అప్‌సెట్ ప్రైస్) నిర్ణయించిన ఈ స్థలాన్ని వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ 'భవన విజయం వెల్ఫేర్ అసోసియేషన్'తో పాటు ఫేజ్ 3, 5, 6 నివాస సంఘాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, సదరు స్థలం వేలంపై రెండు వారాల పాటు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.కోర్టు ఆదేశాల మేరకు వివాదాస్పద ఫేజ్–3 స్థలాన్ని మినహాయించి, ఫేజ్–15లో



నోటిపై చేసిన మిగిలిన ప్లాట్ల వేలాన్ని యథాతథంగా నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పశ్చిమ విభాగం) కిరణ్ బాబు తెలిపారు. మొత్తం 22 ప్లాట్లు వేలానికి పెట్టగా 11 ప్లాట్లు అమ్ముడై,మిగితా 11 ప్లాట్లు హౌసింగ్ బోర్డు దగ్గరే ఉన్నాయి.వేలానికి ఉంచిన స్థలాల వివరాలు:కోర్టు స్టే ఉత్తర్వులకు ముందు హౌసింగ్ బోర్డు మొత్తం రెండు ఓపెన్ ల్యాండ్ పార్శిల్స్‌తో పాటు ఎల్ఐజీ (LIG), ఎంఐజీ (MIG), హెచ్ఐజీ (HIG) విభాగాలలో 22 నివాస ప్లాట్లను వేలానికి ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, స్థానికుల తీవ్ర అభ్యంతరం:ఈ వేలంపై స్థానికులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నేత ప్రీతమ్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ తదితరులు వేలాన్ని వ్యతిరేకించారు. దశాబ్దాల క్రితం 'లాభం లేని–నష్టం లేని' ప్రాతిపదికన రైతుల నుంచి సేకరించిన భూములను ప్రజా అవసరాలు, పార్కులు, పాఠశాలల కోసం కేటాయించారని, ఇప్పుడు వాటిని వాణిజ్య సంస్థలకు విక్రయించడం సరికాదని ఆందోళనకారులు విమర్శించారు.మరోవైపు, ఫేజ్–15 ప్లాట్ల విషయంలో హుడా (HUDA) ఆమోదిత లేఅవుట్ స్పష్టత లేకపోవడం, నోటిఫికేషన్లలో రోడ్డు వెడల్పు (80 అడుగులు, 100 అడుగులు) విషయంలో ఉన్న వ్యత్యాసాలు, భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతుల జారీలో జాప్యం జరిగే అవకాశాలపై కొనుగోలుదారులు, విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్: సోషల్ మీడియా వేదికగా వైఎస్ఆర్‌సిపి ని, ముఖ్యంగా వైఎస్ భారతిని టార్గెట్ చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధికార ప్రతినిధి శ్యామల రెడ్డి కోరారు. సోషల్ మీడియాలో మహిళా నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ నార్సింగి పోలీసులను వైఎస్సార్సీపీ నాయకురాలు అధికార ప్రతినిధి శ్యామల రెడ్డి గురువారం కలిసి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .... హైదరాబాద్‌లో సోషల్ మీడియా వేదికగా మహిళా రాజకీయ నాయకులపై అసభ్యకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారం వ్యక్తిగతంగా తీవ్ర కలకలం రేపుతోంది అన్నారు. వైఎస్సార్సీపీ మహిళా నేతలు, ముఖ్యంగా వైఎస్ భారతి లక్ష్యంగా కొందరు సోషల్ మీడియా గ్రూప్‌లో అసభ్యకర వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.ఈ వ్యవహారంపై పలువురు హోస్టులు, కో–హోస్టులు, ఇతర సోషల్ మీడియా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నార్సింగి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్లు



ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్: ప్రమాదాల నివారణకు డాక్టర్ శశికాంత్ మానవత్వాన్ని చాటుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ లోని సాయి బాలాజీ కాలనీ వద్ద గత కొద్ది రోజుల్లో నాలుగు పెద్ద రోడ్డు ప్రమాదాలు జరిగాయి. బాలాజీ కాలనీ నివాసులు ఈ రోడ్డు ప్రమాదాల విషయమై బర్త్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ శశికాంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే తన సొంత డబ్బుతో బ్యాటరీ గేట్లను ఎక్కడ ఏర్పాటు చేశారు. దీంతో బాలాజీ కాలనీవాసులు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శేఖర్ గుప్తా, రాజు యాదవ్, కన్నా రెడ్డి, రోహిత్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, వంశీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో ప్రెస్ క్లబ్ శంకుస్థాపనా..?

- ఏకపక్ష నిర్ణయాలను ఖండిస్తున్నాం
-త్వరలో అన్ని సంఘాలను కలుపుకొని ప్రెస్ క్లబ్ కమిటీ
టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా నేతలు

ముద్ర, వనపర్తి :వనపర్తి పట్టణంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం వివాదాస్పదంగా ఉన్న నేపథ్యంలో, అక్కడ నిర్వహించనున్న భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు తాము దూరంగా ఉంటామని టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా అధ్యక్షుడు మాధవ రావు, జిల్లా కార్యదర్శి బి రాజు, కోశాధికారి మన్యం , పట్టణ అధ్యక్షుడు అరుణ్ రాజ్,జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆంజనేయులు సాగర్, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్, కోశాధికారి సురేష్,సీనియర్ పాత్రికేయులు నాగేంద్రం చారి, ఆంధ్రప్రభ స్టాప్ రిపోర్టర్ తిరుపతయ్య, స్పష్టం చేశారు. జర్నలిస్టులందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, ఒకరిద్దరు వ్యక్తులు ప్రెస్ క్లబ్ పేరుతో ఏకపక్షంగా శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నించడం సరైన విధానం కాదని వారు పేర్కొన్నారు.జర్నలిస్టు సంఘాల సమన్వయం, అందరి ఆమోదం లేకుండా ప్రెస్ క్లబ్ పేరుతో చేపడుతున్న కార్యక్రమాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ క్లబ్ పేరుతో కొంతమంది కలిసి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రెస్ క్లబ్ కేవలం వారి వ్యక్తిగత మాత్రమే అని వారు తెలిపారు. ఇప్పటికే రెండు ప్రెస్ క్లబ్ లు వనపర్తి లో ఏర్పాటయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో అన్ని సంఘాలను కలుపుకొని ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని




వెల్లడించారు.ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అందుకు జర్నలిస్టుల పక్షాన రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మెఘా రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. అయితే భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావులేని స్థలాన్ని ఎంపిక చేసి భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. గతంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ఎదురైన పరిణామాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రెస్ క్లబ్ భవనం జర్నలిస్టులందరికీ ఉపయోగపడేలా ఉండాలే తప్ప, భవిష్యత్తులో వివాదాలకు కేంద్రంగా మారకూడదని స్పష్టం చేశారు.జర్నలిస్టులం దరికీ ఆమోదయోగ్యమైన స్థలాన్ని ఎంపిక చేసి, అన్ని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో చర్చించి, అందరి భాగస్వామ్యంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని వారు కోరారు. ఏకపక్ష నిర్ణయాలతో జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించవద్దని, ఐక్యతను కాపాడుతూ ప్రెస్ క్లబ్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులను రాజకీయాలకు పావులుగా వాడుకోవద్దని కోరారు. జిల్లాలో 350కు పైగా సభ్యత్వాలు, వనపర్తి పట్టణంలో వందకు మంది జర్నలిస్టులకు పైగా సభ్యత్వాలు కలిగిన టియుడబ్ల్యూజే (ఐజేయు) సంఘంగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

కూకట్‌పల్లిలో కాంగ్రెస్ బలోపేతంపై సీనియర్ నాయకుల కీలక సమావేశం

ముద్ర, కూకట్‌పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకుల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు తీర్మానించారు. ఎన్నికల్లో పార్టీ ఇచ్చిన హామీల అమలు తీరును వివరిస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమాజంలోని అట్టడుగు వర్గాల వరకు చేరేలా నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నేతలు పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడంతో పాటు, కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని స్థానిక నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుపోతూ, సమన్వయం, ఐక్యతతో పార్టీని బలోపేతం చేయాలని సమావేశంలో నేతలు సంకల్పించారు.ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, గతంలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సంజీవరావు, సీనియర్ నాయకులు సీహెచ్ కొండల్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేసిన విట్టల్ రెడ్డి, అబ్దుల్ బాకీ, మాజీ డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, నాయకులు కృష్ణ రాజ్‌పుత్, రాజశేఖర్ రెడ్డి, సుంకన్న, గోవింద్ గౌడ్, ఎస్సీ సెల్ నాయకుడు రాము, మైనారిటీ సెల్ నాయకుడు చోటా మొయిజ్, షేక్, నాగేశ్వరరావు, నరేష్, వెంకటేష్ యాదవ్, మదన్‌మోహన్ తదితరులు హాజరయ్యారు.

చదువుతో పాటు ప్రభుత్వ పరిపాలనా విధానాలను పరిశీలించాలి



ముద్ర, భూపాల్‌పల్లి: విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో చదివే అంశాలతో పాటు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పరిపాలనా విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా మరింత మెరుగైన అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్ సూచించారు. స్టడీ టూర్‌లో భాగంగా గురువారం చెల్పూర్‌లోని చైతన్య హైస్కూల్ విద్యార్థులు భూపాలపల్లి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించి, ఆయా శాఖల విధులు, బాధ్యతలు, పరిపాలనా నిర్వహణ తీరును ఆసక్తిగా తెలుసుకున్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం, మీడియా సమన్వయం, ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో పౌర సంబంధాల శాఖ నిర్వహించే విధులు నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు శాఖలు ఏ విధంగా అమలు చేస్తాయి, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల విధులు, బాధ్యతలు ఏమిటి అనే అంశాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా కలెక్టరేట్ అనేది ప్రభుత్వ పరిపాలనకు కేంద్ర బిందువని, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని వివరించారు. ఇలాంటి విద్యా పర్యటనలు విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, సివిల్ సర్వీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు, మన జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చెల్పూర్ చైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా జీసీసీలు

టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
ఇతర పరిశ్రమలతో ఐటీ రంగం అనుకూలతల అనుసంధానం
మార్స్ జీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ముద్ర, హైదరాబాద్:తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను కీలక చోదక శక్తులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కొత్త టెక్నాలజీ అభివృద్ధి, ఆర్ అండ్ డీ, డేటా అనలిటిక్స్, ప్రొడక్ట్ డిజైన్, ఇంజినీరింగ్, ఇన్నోవేషన్ తదితర విభాగాల్లోనూ కీలక పాత్ర పోషించేలా వాటికి మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. స్నికర్స్, పెడిగ్రీ, రాయల్ కానిన్ తదితర ప్రముఖ బ్రాండ్లతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మార్స్ సంస్థ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన జీసీసీని ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... హైదరాబాద్‌ను సంప్రదాయ ఐటీ సేవల కేంద్రం నుంచి ప్రపంచస్థాయి టెక్నాలజీ, ఇన్నోవేషన్, నాలెడ్జ్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. కొత్త రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఉద్యోగ అవకాశాలను పెంపొందించేందుకు ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్‌కు



ఉన్న అనుకూలతలను ఇతర పరిశ్రమలతో అనుసంధానించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగానే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లోనూ టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జెన్‌పాక్ట్ సహకారంతో ఏర్పాటైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 400 మందికి పైగా ఉపాధి లభించనుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య వేయికి పెరుగుతుందన్నారు. మార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ కు అవసరమైన డిజిటల్, డేటా, ఏఐ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ క్లాస్ ఆగార్డ్, జెన్‌పాక్ట్ ప్రతినిధి తరుణ్ చోప్రా, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ ప్రతినిధి ఎమీలియా బి. స్మిత్ తదితరులు పాల్గొన్నారు.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 13.11.2026
www.mudranews.in | @mudranews

అవసరమైతే వైద్యుల సహాయం తీసుకోండి!

నికోటిన్ వ్యసనాన్ని కేవలం సంకల్పంతోనే అధిగమించాల్సిన అవసరం లేదు. వైద్యుల సలహాతో నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ, కౌన్సెలింగ్, అవసరమైతే మందులు తీసుకోవచ్చు. ఇవి సిగరెట్ మానేయడంలో విజయావకాశాలను పెంచుతాయి.



ఎన్విడియా సీఈవో జెన్సన్ రాజీనామా



ముద్ర, న్యూఢిల్లీ : ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. చైనా గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అలిస్ హువాంగ్ తో వివాహేతర సంబంధమున్నట్లు ఆయన ఇటీవల వెల్లడించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో సంస్థకు చెందిన మహిళతోనూ సంబంధాలున్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో జెన్సన్ పదవి నుంచి వైదొలగాలనే డిమాండ్లు మొదలయ్యాయి. తాజా పరిణామాలు జాతీయ భద్రతపై ఆందోళనలు రేకెత్తించడంతో రాజీనామా చేస్తున్నట్లు జెన్సన్ ప్రకటించారు. జెన్సన్ రాజీనామా నేపథ్యంలో తాత్కాలిక సీఈవోగా కొలెట్ క్రెస్‌కు బాధ్యతలు అప్పగించినట్లు ఎన్విడియా ప్రకటించింది. ప్రస్తుతం ఆమె సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా ఉన్నట్లు తెలిపింది. తాజా సోషల్ వేదికగా పేర్కొన్నారు. పరిణామాలతో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన ఎన్విడియా షేర్లు ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో 10 శాతం పతనం కావడం గమనార్హం.

జెన్సన్ హువాంగ్ రాజీనామాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ''ఎన్విడియా సీఈవో అద్భుతంగా విధులు నిర్వర్తించారు. ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి ఒక్కరే ఉన్నారు. ఆయనే టిమ్ కుక్. ఒక దిగ్గజం స్థానాన్ని మరో దిగ్గజం మాత్రమే భర్తీ చేయగలరు'' అని ట్రూత్

శంకర్ గౌడ్ కుమారుడికి ఆర్టీసీలో ఉద్యోగ నియామకం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం: మంత్రి పొన్నం ప్రభాకర్

ముద్ర, హైదరాబాద్ : గతంలో ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్ గౌడ్ కు ఆర్టీసీలో రికార్డ్ టైపిస్ట్ గా ఉద్యోగ నియామక పత్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి అందజేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉద్యోగ నియామకం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనల మేరకు శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున పరిహారం అందించామని చెప్పారు. తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులంతా ఒక రోజు వేతనం రూపంలో దాదాపు కోటి రూపాయలు అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారని వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం హేమంత్ గౌడ్ కు ఉద్యోగ నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన చర్యలు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అని, ఉద్యోగులను కాపాడుకోవడం సమాజ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. సిబ్బంది ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, భౌతిక దాడులకు పాల్పడవద్దని సూచించారు. ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు జరిగితే ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తుందని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికులు మర్చిపోయిన విలువైన వస్తువులను నిజాయితీగా తిరిగి అప్పగిస్తున్న ఉద్యోగులు ఆర్టీసీలో ఎందరో ఉన్నారని గుర్తుచేశారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రయాణికుల అవసరాల మేరకు కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలకు బస్సు సౌకర్యం అవసరమైతే స్థానిక అధికారులను సంప్రదించాలని, రూట్ వెరిఫికేషన్, సాధ్యాసాధ్యాల పరిశీలన అనంతరం బస్సు సౌకర్యం కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘం నేతలు వెంకన్న, బాబూరావు, ఇతర నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కోహెడ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులపై మంత్రి తుమ్మల సమీక్ష



ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్ సమీపంలోని కోహెడలో నిర్మిస్తున్న అంతర్జాతీయ స్థాయి ఫ్రూట్ మార్కెట్ పనుల పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్కెట్ నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు చేపట్టిన లేఔట్ వివరాలు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో చర్చించారు. నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ అడ్వైజర్, ప్రభుత్వ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎండీతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



ముద్ర, వెల్గటూరు: వెల్గటూరు మండలంలోని కోటిలింగాల ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు పుష్కరాల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కోటిలింగాల ఆలయ పునర్నిర్మాణం, గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కోటిలింగాల పుణ్యక్షేత్రానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలోఉంచుకొని ఆలయాభివృద్ధి, పుష్కరాల ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్ తదితరులు ఉన్నారు.

రాజధాని బస్సులో ఎమర్జెన్సీ అలారం..

భయంతో పరుగులు తీసిన ప్రయాణికులు



ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ నుండి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ రాజధాని ఏసీ బస్సులో ఎమర్జెన్సీ అలారం రావడంతో డ్రైవర్ అప్రమత్తమై తిమ్మాపూర్ శివారులో బస్సును నిలిపారు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో హైదరాబాద్ వెళ్తున్న బస్సులో అలారం వచ్చింది. దీంతో డ్రైవర్ ను అలెర్ట్ చేసి, ప్రయాణికులు భయంతో దిగిపోయారు. అలారం ఎంతకూ ఆగకపోవడంతో ప్రయాణికులు భయాందోలకు గురయ్యారు. ఇటీవల ఎలక్ట్రికల్ బస్సుల్లో ప్రమాదాల నేపథ్యంలో డీజిల్ బస్సులో కూడా అలారం రావడంతో ప్రయాణికులకు అర్థం కాక ఆందోళన చెందారు.అయితే బస్సు బ్రేక్ డౌన్ కావడంతో మరో బస్సును ఏర్పాటు చేసేందుకు అధికారులు త్వరగా స్పందించలేదని ప్రయాణికులు ఆరోపించారు. ఇందులో ఎయిర్పోర్టుకు వెళ్లేవారు ఉండడంతో ఫ్లైట్ మిస్ అయితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. అనంతరం వచ్చిన బస్సులో హైదరాబాద్ వెళ్లారు.

బంగాళాఖాతంలో మరో తుఫాన్ ముప్పు..

తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన..

ముద్ర, హైదరాబాద్: బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ మార్పులు వేగంగా చోటుచేసుకుం టున్నాయి. రేపు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏర్పడనున్న ఈ అల్పపీడనం క్రమంగా పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. రానున్న 24 గంటల తర్వాత సముద్రంలో గాలుల వేగం పెరిగి, అలల ఉద్ధతి ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఈ వాయుగుండం మరింత బలపడి తుఫాన్‌గా రూపాంతరం చెందే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి. తుఫాన్‌గా మారిన తర్వాత ఇది తన దిశను మార్చుకుని ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. దీని ప్రభావంతో రాబోయే మూడు నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు తక్షణమే తీరానికి చేరుకోవాలని సూచించారు. మరోవైపు, వరి కోతల సమయం కావడంతో అకాల వర్షాల హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంట నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అల్పపీడనం కదలికలను, తుఫాన్ తీవ్రతను వాతావరణ కేంద్రం నిరంతరం పర్యవేక్షిస్తోంది. రాబోయే 48 గంటల్లో దీని గమనంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తీర ప్రాంత ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

హైదరాబాద్‌లో ఆపరేషన్ థండర్‌బోల్ట్

ముద్ర, హైదరాబాద్: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలతో హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అన్ని పోలీస్ జోన్ల పరిధిలో ఏకకాలంలో ఆపరేషన్ థండర్‌బోల్ట్ చేపట్టారు. దాదాపు వెయ్యి మందికి పైగా సిబ్బందితో విస్తృత తనిఖీలు చేపట్టారు. గోల్కొండ జోన్‌లోని హుబీబ్‌నగర్, మంగళ్‌హాట్ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు కొనసాగాయి. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ అండ్ ఎస్ఐటీ) ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. తనిఖీల్లో సుమారు 60 మంది డ్రగ్స్ వినియోగదారులను, సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 100కు పైగా వాహనాలను గుర్తించారు. తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

22-ఎ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదు
పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు-కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి
కలెక్టర్ల బాధ్యతాయుతమైన పర్యవేక్షణతోనే సామాన్యులకు నిజమైన ప్రయోజనం
జిల్లా కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



ముద్ర, హైదరాబాద్: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22-ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ దిశగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22-ఎ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి గారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, 22-ఎ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు, 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యూఎల్సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై 22-ఎ సమస్యల పరిష్కారంపై సమీక్షించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్‌కుమార్ నాయకత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న జీవోలు, మెమోలు కేవలం ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం కాకూడదని, వాటి అసలు ఉద్దేశం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూఎల్ సికి సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్పీలు) దాఖలు చేసే అంశాలు, ఎస్ఎల్పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలన్నింటిపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక అందించాలని మంత్రి సూచించారు. ఈ నివేదికపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 22-ఎ జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిజమైన యజమానులు తమ భూములపై హక్కులు పొందేందుకు అనవసరమైన జాప్యం జరగకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా చూడాలన్నారు.

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు బండి సంజయ్ పరామర్శ



ముద్ర చిగురుమామిడి: చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో మొన్నపందిళ్ళ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం లో మరణించిన తండ్రి కూతురు పైడిపల్లి శ్రీకాంత్ , మహాన్వీక

కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ కుమార్ గారు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. అలాగే గత కొద్ది రోజుల క్రితం దళిత మోర్చ మండల అధ్యక్షులు దొంత కర్ణాకర్ వాళ్ళ నాన్న దొంత మల్లయ్యా గారు మరణించిన విషయం తెలుసుకొని చిగురుమామిడి మండల కేంద్రంలోనీ వారి ఇంటికి వెళ్ళి కర్ణకర్ గారిని కలిసి కర్ణకర్ గారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని తెలిపారు



బండి సంజయ్ కుమార్ గారి తో పాటు బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటి రెడ్డి రాంగోపాల్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు గుజ్జా శ్రీనివాస్ కమ్మం వెంకటేశం జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్ మాచెర్ల కుమార్ జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృధ్వీరాజ్ జిల్లా కార్యవర్గ సభ్యులు అచ్చ రవీందర్ మండల ప్రధాన కార్యదర్శిలు గుణుకుల మధుసూదన్ రెడ్డి బుద్దర్తి మహేందర్ ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు కంది శంకర్ ఉపాధ్యక్షులు మాజీ మండల అధ్యక్షులు పైడిపల్లి శ్రీనివాస్ పెసరి హరీష్ కిరణ్ సంపత్ పెండ్యాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 13.11.2026
www.mudranews.in | @mudranews

సిగరెట్‌కు దూరంగా ఉండేలా వాతావరణాన్ని మార్చుకోండి

ఇంట్లో, ఆఫీసులో సిగరెట్ ప్యాకెట్లు, లైటర్లు ఉంచుకోకూడదు. స్మోకింగ్ చేసే స్నేహితులతో కలిసి ఉండే సందర్భాలను కొంతకాలం తగ్గించుకోవాలి.



ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూస్తాం

అధికారులందరూ సమస్యలను పరిశీలించాలి

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ జాతోతు హుస్సేన్ నాయక్

ముద్ర, దేవరకొండ:కొండమల్లేపల్లి మండలం, గాజీ నగర్‌లో షెడ్యూల్డ్ తెగల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎస్టీలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుంటున్నామని ,వివిధ గ్రామాల నుండి అందుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువ సమస్యలు ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు.దేశంలో షెడ్యూల్ తెగల ప్రజల హక్కులకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని, ఎవరైనా ఎస్టీ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం కోర్టు ద్వారా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్టీ ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులను నిర్భయంగా తెలియజేయాలని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.గాజ్‌నగర్ గ్రామంలో నెలకొన్న రోడ్లు, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.



ఆర్‌అండ్‌ఆర్ (పునరావాసం, పునరుద్ధరణ) కింద భూములు కోల్పోయిన బాధితుల వివరాలను సేకరించి అందించాలని ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి శుక్రవారం నాటికి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎస్టీ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించాలని, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు ఎదుర వుతున్న సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎన్సీఎస్టీ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి ,డిటిడిఓ కమలాకర్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,డిఎంహెచ్ఓ రాహుల్, ఆర్డీవో వనజారని,సర్పంచ్ పార్వతి సత్యనారాయణ ,జిల్లా,మండల అధికారులు ,తదితరులు పాల్గొన్నారు .

రాచకొండ కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి







రాచకొండ కోటను పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని చారిత్రక రాచకొండ కోటను సందర్శించారు.ఈ సందర్భంగా కోట పైభాగం వరకు వెళ్లి పురాతన కోట గోడలు, చారిత్రక కట్టడాలు, కొలనులను పరిశీలించారు. వాటి చారిత్రక విశేషాలు, ప్రాధాన్యత గురించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం, ప్రాచీన కట్టడాలు, సహజ సౌందర్యంతో ప్రత్యేక గుర్తింపు కలిగిన రాచకొండ కోటకు పర్యాటకంగా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఇలాంటి చారిత్రక ప్రదేశాలను పరిరక్షించడంతో పాటు, పర్యాటకులను ఆకర్షించే విధంగా రాచకొండ కోటను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాచకొండ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకువచ్చేలా అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజన్ అధికారి శేఖర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ ధర్నా

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోని, యాదాద్రి భువనగిరి జిల్లాను పూర్తిస్థాయి కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా చేశారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు



ఎండిపోవడంతో అప్పుల భారంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులందరికీ వరి ఎకరాకు 30 వేలు, పత్తి, కంది ఎకరాకు 50 వేలు, ఇతర వాణిజ్య పంటలకు ఎకరాకు 20 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, రైతులకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని, రైతులకు పంట రుణాలు వాయిదా వేస్తూ వడ్డీ మాఫీ చేసి రీషెడ్యూల్ సౌకర్యం కల్పించాలని, సాగునీరు మరియు తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, ఎండీ ఇమ్రాన్, చెక్క వెంకటేష్, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, ఏశాల అశోక్, పేరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యులు మండల కార్యదర్శులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం

ముద్ర దేవరకొండ: రానున్న కాలంలో సూపర్ ఎలినినో ప్రభావంతో కరువు పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో త్రాగునీటి సమస్యలు రాకుండా ముందస్తూ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. కొండమల్లేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి దేవరకొండ నియోజకవర్గం శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్,



మండల ప్రత్యేకాధికారి టి.విజయేందర్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సి.హెచ్.స్వర్ణలత, తహసిల్దార్ నరేందర్, మరియు మండల అధికారులు ,సర్పంచ్లు హాజరైనారు. శాఖల వారిగా రివ్యూ నిర్వహించనైనది. సర్పంచ్ లు వారి సమస్యలను తెలుపగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పరిష్కరించుటకు గాను అధికారులను ఆదేశిస్తూ పలు సూచనలు చేసినారు. మాట్లాడుతూ మరియు రైతులకు ఆరుతడి పంటలపై అవగాహణా కల్పించవలసినదిగా అధికారులను ఆదేశించినారు. కృష్ణా జలాలను చాలా పొదుపుగా వాడుకొనే విధంగా గ్రామ ప్రజలకు అవగాహణ కల్పిస్తూ అధికారులు మరియు సర్పంచ్ లు సమన్వయం చేసుకొని గ్రామాలలో కరువు పరిస్థితులు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొనుటకు ఆదేశించినారు.

కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని తిప్పలు

కొనుగోళ్లు చేపట్టకపోవడంపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనాజీపూర్, నందనం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి 20 రోజుల క్రితమే మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. సరైన విద్యుత్ సరఫరా లేక వేలాది ఎకరాల పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, చేతికొచ్చిన కొద్దిపాటి పంటనైనా ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో రైతులు దళారులకు రూ.1,800 నుంచి రూ.1,900కే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు బార్దాన్ (గోనె సంచులు) చేరలేదని, రైస్ మిల్లుల కేటాయింపులు కూడా పూర్తికాలేదని పేర్కొన్నారు. వెంటనే గోనె సంచులు సరఫరా చేసి, రైస్ మిల్లులను కేటాయించి వడ్ల కొనుగోళ్లు ప్రారంభించేలా భువనగిరి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గోద శ్రీనివాస్ గౌడ్, మదర్ డైరక్టర్ కస్తూరి పాండు, నందనం సర్పంచ్ నాగేల్లి గిరిజ రమేష్ గౌడ్, బీఆర్ఎస్ యువ నాయకులు మట్ట దానంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ రాసాల మల్లేష్ యాదవ్, బాత్క అశోక్ యాదవ్, బొల్లేపల్లి మాణిక్యం, ఎలిమినేటి విఠల్ రెడ్డి, చింతల దేవేందర్ గౌడ్, బొల్లేపల్లి అశోక్, ఎదునూరి చంద్రయ్య, మొలుగు నాగరాజు, మట్ట బాలకృష్ణ గౌడ్, రైతులు ఎలిమినేటి మధుసూదన్ రెడ్డి, రెడ్డి మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, సోముల వెంకట్ రెడ్డి తదితర గ్రామాల రైతులు, మహిళలు పాల్గొన్నారు.

మహాదేవపూర్ ఆలయాల్లో సంతోష్‌రావు ప్రత్యేక పూజలు

ఆలయ ఆవరణలో మొక్కలు నాటిన మాజీ ఎంపీ

బీబీనగర్, ముద్ర:



బీబీనగర్ మండలం మహాదేవపూర్ గ్రామంలో అక్కన్న, మాదన్నలు నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ఉమామహేశ్వర ఆలయాలను రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌రావు గురువారం సందర్శించారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాయకపు మాధురి వెంకటేష్‌తో కలిసి ఆయన ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు.కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కందాడి రవణమ్మ బాల్‌రెడ్డి, సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల ప్రభాకర్, రాచమల్ల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సుధాకర్ గౌడ్, బొక్క జైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అర్చకులు శ్రీమన్నారాయణ చార్యులు, రాఘవేందర్ శర్మ, ఈవో రవిమూర్తి, ఉప సర్పంచ్ చెవుల భవాని కరుణాకర్ పాల్గొన్నారు. ధర్మకర్తలు బాధిని ఆంజనేయులు గౌడ్, టీజీ రవీందర్ సింగ్, చెవుల సురేందర్‌రెడ్డి, మునిగల సంజీవ, వార్డు సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, గ్రామ పెద్దలు కందాడి భూపాల్‌రెడ్డి, దండెం వెంకటేష్, ఎలిమినేటి స్వామిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

రైతు బజార్‌లో బియ్యం అమ్మకానికి ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరకే బియ్యం అమ్మకాలకు భువనగిరి పట్టణంలోని రైతు బజార్ లో ప్రత్యేక కౌంటర్ ను జిల్లా పౌర సరఫరాల అధికారి (డి ఎస్ ఓ) రోజారాణి గురువారం ప్రారంభించారు.ఈ కౌంటర్ లో ప్రభుత్వ ధరకే కింది రకాల బియ్యం అందుబాటులో ఉంటాయని తెలిపారు.ధరల వివరాలు (కిలోకు):బీపీటీ బియ్యం – రూ. 66/– తెలంగాణ సోనా రూ. 74/–జే ఎస్ఆర్ బియ్యం – రూ. 79/–ప్రజలు బయట మార్కెట్ లో ఎక్కువ ధర పెట్టి కొనకుండా, ఈ కౌంటర్ లోనే నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వ ధరకే కొనుగోలు చేయాలని ఆమె కోరారు.



కుల మతాలకతీతంగా గ్యార్వి షరీఫ్ పండుగ

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :భువనగిరి పట్టణంలోని మీనానగర్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు హిరేకర్ శీను ఆధ్వర్యంలో గ్యార్వి మాసం లో ముస్లిం సోదరులు ఈ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హీరేకర్ శీను తన నివాసంలో ముస్లిం సోదరులు పండుగకు శుభాకాంక్షలు తెలిపి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పాల్గొన్నగా మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పెంట నరసింహ, కౌన్సిలర్ పోలిశెట్టి అనిల్, యాదగిరిగుట్ట మాజీ కౌన్సిలర్లు సీస కృష్ణ, బోయిని బాలయ్య, మల్లికార్జున్ రెడ్డి, నుబ్బురు సిద్దేశ్, గోపె ఎల్లయ్య, సిలువేరు శ్రీనివాస, ఎండి కరీం, సాయి, నాగరాజు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 13.11.2026
www.mudranews.in | @mudranews

సిగరెట్ తాగాలనే కోరికను 5 నిమిషాలు వాయిదా వేయండి

సిగరెట్ తాగాలనే కోరిక వచ్చిన వెంటనే దాన్ని వెలి గించకండి. కొద్దిసేపు వేచి ఉండి నీళ్లు తాగడం, వేరే పనిలో నిమగ్నం కావడం ద్వారా ఆ కోరికను అధిగ మించవచ్చు.



విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించాలి

ఎంపీ ఈటల రాజేందర్
భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశం కోసం పనిచేయాలని యువతకు పిలుపు
మోదీ నాయకత్వాన్ని ఎదుర్కొనే శక్తి ప్రతిపక్షాలకు లేదు

ముద్ర, హైదరాబాద్: విద్యార్థుల్లో జాతీయ భావాలు, దేశభక్తి పెంపొందించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత దేశం కోసం పనిచేయాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, సమాజంలో మార్పు తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) జాతీయ అధ్యక్షుడు హేమంత్ జోష్‌తో కలిసి నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహించిన బీజేవైఎం సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. నలభై ఏళ్ల క్రితం తాను కూడా విద్యార్థి నేనని, అప్పట్లో భగత్‌సింగ్ తనకు గొప్ప స్ఫూర్తిగా నిలిచారని గుర్తుచేశారు. జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ జరిపిన కాల్పుల ఘటనతో చలించిపోయిన భగత్‌సింగ్ చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని సంకల్పించారని వివరించారు. భారతమాత విముక్తి కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ త్యాగం యువతకు ఎప్పటికీ ఆదర్శమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో బాంబుల మోతలు, అవమానకర పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం దేశంలో పరిస్థితులు మారాయని ఈటల వ్యాఖ్యానించారు. దేశం వేగంగా



అభివృద్ధి చెందుతోందని అన్నారు.మరణించినవారి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారి ఓట్ల తొలగింపు అంశంపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇలాంటి అంశాలపై యువత వాస్తవాలను తెలుసుకుని స్పందించాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సుమారు 40 లక్షల ఓట్లు ఉండగా, కేవలం 20 లక్షల మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఓట్లు ఉండటం కూడా తక్కువ పోలింగ్‌కు ఒక కారణమని వివరించారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, ప్రజాదరణను ఎదుర్కొనే శక్తి ప్రతిపక్ష పార్టీలకు లేదని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. మోదీని ప్రధానమంత్రి పదవి నుంచి దించే సామర్థ్యం ప్రతిపక్షాలకు లేదని ధీమా వ్యక్తం చేశారు. యువత జాతీయ భావాలతో పాటు ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.

వరి వద్దు.. ఆరుతడి పంటలు సాగు చేయండి

విద్యుత్ ఎస్ఈ నారాయణ నాయక్



ముద్ర ప్రతినిధి, మెదక్: ఎల్ నినో పరిస్థితులు, భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు పండించుకోవాలని విద్యుత్ శాఖ మెదక్ జిల్లా ఎస్ఈ నారాయణ నాయక్ రైతులకు సూచించారు. మెదక్ జిల్లాలో అన్నదాతలు, గృహ విద్యుత్తు వినియోగదారులు విద్యుత్తు పొదుపుగా వాడుకోవాలని, తమ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో లక్షా 10 వేల వ్యవసాయ, 2.28 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. 570 మెగావాట్ల విద్యుత్ అవసరం కాగా సరఫరా చేస్తున్నాం. పరిశ్రమలకు 150 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. జిల్లాలో 220 కేవి-2, 33/11 కేవి-131, 11కేవి 132 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సోలార్ ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఈ నారాయణ నాయక్ సూచించారు. సబ్సిడీ ఉంది, వినియోదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం గృహవిద్యుత్తుకు సంబంధించి వినియోగం ఎంతగానో పెరిగిందని...అయినప్పటికీ డిమాండ్‌కు సరిపడా విద్యుత్తు సరఫరా చేస్తున్నామని ఈ విషయంలో ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు తీసుకుంటున్న మన్నారు. ప్రభుత్వం సూచన మేరకు ఈ సీజన్‌లో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయడం వల్ల విద్యుత్తు వినియోగం తక్కువగా ఉంటుందని దీనివల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని వివరించారు. జిల్లాలో తమ శాఖ ఆధ్వర్యంలో సదస్సులను సైతం నిర్వహించి రైతులకు ముమ్ముందు విద్యుత్తుకు సంబంధించి ఏర్పడే పరిస్థితులను వివరించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం ఇళ్లల్లో, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను అవసరం మేరకే వినియోగిస్తు, విద్యుత్తును వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవడం ఎంతో అవసరమని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం విద్యుత్తు వినియోగం పెరిగినప్పటికీ సరిపడా సరఫరా చేస్తున్నామన్నారు.


'ఇండ్ల' దళారీపై కేసు నమోదు చేయాలి



ఎరుకల నాంచారమ్మ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారు
మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీకి బాధితుల ఫిర్యాదు

ముద్ర, ఎల్బీనగర్, నవంబర్ 12 : మన్సూరాబాద్ డివిజన్ లోని ఎరుకల నాంచారమ్మ నగర్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు బొంగు వెంకటేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. భారత ఎరుకల కుల వృత్తుల అభివృద్ధి సేవా సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వనం గంగయ్య, వైస్ ప్రెసిడెంట్ దాసరి గంగాధర్, బాధితులు తదితరులు గురువారం మన్సూరాబాద్ డివిజన్ సౌత్ ఎండ్ పార్కుకు వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎరుకల నాంచారమ్మ ఏకలవ్య నగర్ కాలనీలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో ఇండ్లు ఇప్పిస్తామని స్థానికంగా ఉన్న సాగర్ గంగయ్య అనేక మంది దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పారు. తనకు రాజకీయ పలుకుబడి ఉందని, అధికారులు వెంట ఉన్నారని అనేక మంది పేదలను మభ్యపెట్టి ఒక్కొక్కరి నుంచి సుమారు రూ, 3 లక్షలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు దాసరి మమత, భిక్షమ్మ, ఎరుకల నాంచారమ్మ బస్తీ నాయకులు పాల్గొన్నారు.

మైత్రి మధుర కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు



ముద్ర, హైదరాబాద్:ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర యాదవ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ తెలిపారు.ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని మైత్రి మధుర కాలనీలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, ఏఐసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించిన భాస్కర్ యాదవ్, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎక్కడా రాజీ పడకుండా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఓపెన్ జిమ్ అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు వ్యాయామం, ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా లెక్చరర్స్ కాలనీ, హైకోర్టు కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారమే బాధ్యతగా, ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

యూఏఈలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



ముద్ర ప్రతినిధి, మెదక్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రంగంలో (యూఏఈ)లోని నిర్మాణ ఉద్యోగావకాశాల కోసం అర్హులైనవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెదక్ జిల్లా ఉపాధి కల్పన అధికారి రామరాజు తెలిపారు. 22 నుంచి 42 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఉచిత విమాన టికెట్, వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 080 35524946 నంబర్ కు మిస్డ్ కాల్ ఇవ్వాలని, www.tomcom. telangana.gov.in ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి, వివరాలకు 040-23342040 నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

ఎల్ నినో గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ నగేష్



ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లాలో ఎల్ నినో గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులు, ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి ఎంపీడీవోలతో ఎల్ నినో గ్రామసభలు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, జలసిరి పనులు, అంగన్వాడి బిల్డింగ్స్ నిర్మాణం, తదితర అంశాలపై గూగుల్ మీట్ నిర్వహించారు. ముందుగా ఎల్ నినో గ్రామసభల నిర్వహణ తీరుపై వివిధ మండలాల ఎంపీడీవోల వారిగా రివ్యూ నిర్వహించారు. అదనపు మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నినో గ్రామసభలు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జలసిరి పనులకు సంబంధించి కొన్ని మండలాల్లో కొత్త పనుల ప్రారంభం, గ్రౌండింగ్, పూర్తిలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంజూరైన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణంలో కూడా పురోగతి పెంచాలన్నారు. వచ్చే వారం నాటికి నిర్దేశించిన లక్ష్యాలకు , మంజూరైన పనులన్నీ ప్రారంభించి పురోగతి సాధించాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించేటప్పుడు ప్రతి శాఖ యాక్టివిటీ గురించి తప్పనిసరిగా చర్చించాలన్నారు. జిల్లా విద్యాశాఖ తరఫున పాఠశాలల్లో ఎల్ నినో అంశంపై విద్యార్థులతో మాట్లాడించాలన్నారు.ప్రతి మండలం వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మిషన్ భగీరథ సంపత్ కుమార్, డిఎల్పీఓలు తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపు నిబంధనలకే పరిమితమా..?

నీటి పొదుపు ప్రజలకే తప్ప ప్రభుత్వానికి వర్తించదా.?
ప్రజలకు కేసులు, జరిమానాల హెచ్చరికలు.
ప్రభుత్వ యార్డులో మాత్రం వేల లీటర్ల నీటి వృథా?
సరూర్‌నగర్‌లో జీహెచ్ఎంసీ వాహనాల శుభ్రత పేరుతో నీటి వృథాపై స్థానికుల ఆందోళన

ముద్ర, సరూర్‌నగర్, నవంబర్ 12: రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందన్న అంచనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి నగరపాలక సంస్థతో పాటు ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో నీటి వినియోగాన్ని తగ్గించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. నీటిని విచ్చలవిడిగా వినియోగించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే నీటి పొదుపు నిబంధనలు సామాన్య ప్రజలకేనా? ప్రభుత్వ శాఖల్లో పనిచేసే సిబ్బందికి కూడా వర్తిస్తాయా? అన్న ప్రశ్నలు సరూర్‌నగర్‌లో చోటుచేసుకున్న ఘటనతో తెరపైకి వస్తున్నాయి. సరూర్‌నగర్‌లో మల్కాజిగిరి నగరపాలక సంస్థ కార్యాలయం పక్కనే ఉన్న జీహెచ్ఎంసీ వాహనాల యార్డులో పారిశుధ్య సిబ్బంది వాహనాలను శుభ్రం చేసే పేరుతో పంపుల ద్వారా పెద్దఎత్తున నీటిని వినియోగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలను కడగడానికి వేల లీటర్ల నీరు వృథా అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని సూచిస్తూ, అవసరానికి మించి నీటిని వాడితే కేసులు నమోదు చేసి



జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్న అధికారులు.. మరోవైపు తమ శాఖకు చెందిన సిబ్బంది నీటిని వృథా చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ప్రజలకు నీటి పొదుపుపై హితబోధ చేసే అధికారులు ముందుగా తమ శాఖల్లోనే నిబంధనలు అమలయ్యేలా చూడాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సామాన్యులు నీటిని అధికంగా వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించే అధికారులు, ప్రభుత్వ సిబ్బంది నీటిని వృథా చేస్తున్న ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో స్పష్టం చేయాలని కోరుతున్నారు. నిబంధనలు ప్రజలకేనా? ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించవా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. సంబంధిత జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే స్పందించి వాహనాల యార్డులో నీటి వినియోగంపై విచారణ చేపట్టాలని, నీటి వృథాకు బాధ్యులైన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మెదక్ సర్కిల్‌కు ప్రత్యేక స్పోర్ట్స్ కౌన్సిల్ బాడీ ఏర్పాటు చేయాలి

టీఆర్వీకేఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ విద్యుత్ సర్కిల్‌కు ప్రత్యేకంగా స్పోర్ట్స్ కౌన్సిల్ బాడీ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అశోక్ ఎస్ఈకి విజ్ఞప్తి చేశారు. మెదక్ సర్కిల్ పరిధిలో క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడల్లో ప్రతిభ కలిగిన ఉద్యోగులు ఎంతోమంది ఉన్నారని, వారికి సరైన వేదిక, ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే రాష్ట్రస్థాయిలో కూడా మెరుగైన ప్రతిభ కనబరుస్తారన్నారు.ప్రస్తుత స్పోర్ట్స్ కౌన్సిల్‌లో మెదక్ సర్కిల్‌కు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, క్రీడా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఉద్యోగులకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.క్రీడలు ఉద్యోగుల మధ్య ఐక్యత, స్నేహభావం, క్రమశిక్షణ, ఆరోగ్యం, టీమ్ స్పిరిట్‌ను పెంపొందిస్తాయని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి సర్కిల్‌కు సమాన ప్రాధాన్యత, అవకాశాలు కల్పించినప్పుడే క్రీడారంగం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555